శ్రేయస్, జైస్వాల్‌ను ఎంపిక చేయాల్సింది

- ఆసియాకప్‌కు జట్టు ఎంపికపై మాజీ క్రికెటర్ల పెదవి విరుపు

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 21 | విజయవాడ, గురువారం 21 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 21 August 2025 | Rs

చిన్న పరిశ్రమలకు టారిఫ్‌ల దెబ్బ

- టెక్స్‌టైల్, డైమాండ్స్, కెమికల్స్‌పై అధిక ప్రభావం
- క్రిసిల్ ఇంటెలిజెన్స్ రిపోర్ట్

3

విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలు

- ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం
- మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన సిఎం చంద్రబాబు

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో చదువుకునే యువతకు విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళగిరి సమీపంలో మయూరి టవర్స్‌లో నూతనంగా నిర్మించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను బుధవారం టాటా గ్రూపు చైర్మన్ చంద్రశేఖరన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అమరావతితో పాటు విజయవాడ, విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, అనంతపురంలలో ఏర్పాటు చేసిన హబ్‌లను కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఎం మాట్లాడుతూ రాష్ట్రం నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందన్నారు. స్టార్టప్‌లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ రూపొందుతుందన్నారు. యువ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్‌లకు ఊతం ఇచ్చేలా రతన్ టాటా హబ్ పనిచేస్తుందన్నారు. రతన్ టాటా ఆలోచలను సజీవంగా ఉంచేందుకు ఈ హబ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు నగరాల్లో ప్రారంభించిన ఈ హబ్‌లు త్వరలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా ఏర్పాటు కానున్నాయని తెలిపారు. యువ పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలన్నదే తమ లక్ష్యం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఇంజినీరింగ్ కళాశాలలు తాము ఏర్పాటు చేశామన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఒక విప్లవాత్మక రంగాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలమన్నారు. రాష్ట్రంలో సంపద పెంచాలని, తద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. టాటా సన్స్ చైర్మన్ రతన్ టాటా మాట్లాడుతూ స్టార్టప్‌లకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ఇన్నోవేషన్ కేంద్రాల ద్వారా ఆరోగ్యం, డిఫెన్సు, వ్యవసాయం తదితర రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉందన్నారు. స్థానిక, ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎక్కడికక్కడ కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఐటి, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆవిష్కరణలు అంటే కేవలం ఐటి ఆధారిత సాంకేతికలు మాత్రమే కాదన్నారు. గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్నిరంగాల్లో ఆవిష్కరణలు జరగాలన్నారు. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేస్తే యావత్ ప్రపంచం మీరు తయారుచేసే ఉత్పత్తులను ఆదరిస్తుంది. ఆరోగ్య సంరక్షణ, బయో డిగ్రేడబుల్ వంటి రంగాల్లో ఔత్సాహికులకు అపారమైన అవకాశాలున్నాయన్నారు.

రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు

ఎపిలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయిలో మిగతా 7లో

చివరి ఆయకట్టుకు చుక్కనీరూ కరువే

- రాజాం, బొబ్బిలి, పార్వతీపురం వరకే 'తోటపల్లి'
- నెల్లిమర్ల, చీపురుపల్లికి చేరని వైనం

3

విశాఖ ఉక్కును ముక్కలు చేసి అమ్మేస్తున్నారు

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

2

15 రోజుల్లోగా ఇళ్లు లేని పేదల జాబితా

- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

2

శశికుమార్ (ఫైల్)

కిన్నెర సాయి (ఫైల్)

సాయి కిరణ్ (ఫైల్)

భీమేష్ (ఫైల్)

వినయ్ (ఫైల్)

మహబూబ్ బాష (ఫైల్)

కర్నూలులో పెను విషాదం

నీటి కుంటలో దిగి ఆరుగురు విద్యార్థులు మృతి

కన్నీటి సంద్రమైన చిగిలి గ్రామం

సిఎం చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ విచారం

ప్రజాశక్తి-ఆస్పరి (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో విషాదం చోటు చేసుకుంది. స్కూలు ముగిసిన తర్వాత సరదాగా ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులను నీటి కుంట కబలించింది. ఈ హృదయ విదారకమైన సంఘటన చిగిలి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు, మరో ఇద్దరు రెండు కుటుంబాలల్లో ఏకైక కుమారులు కలరు. విద్యార్థులందరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆరుగురు చిన్నారులు మృతిచెందడం పట్ల సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారుల మృతి తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చిందన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నీటిలో మునిగి మరణించడం తీవ్రంగా కలిచివేసిందని జగన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు.. చిగిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న ఐదవ తరగతి విద్యార్థులు శశి కుమార్ (10), కిన్నెర సాయి (10), సాయికిరణ్ (10), భీమేష్ (10), వినయ్ (10), మహబూబ్ బాషా (10), దుర్గప్రసాద్‌లు కలిసి స్కూలు ముగిసిన తర్వాత పాఠశాలకు మిగతా 7లో

సమస్యలపై సాచివేత

- స్పష్టత కరవైన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్
- ఉద్యోగ సంఘాల అసంతృప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బదులుగా సాచివేతే లక్ష్యంగా బుధవారం జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ జరిగింది. సిఎస్ విజయానంద్ నిర్వహించిన ఈ సమావేశంలో ఏ ఒక్క అంశంపై కూడా ప్రభుత్వం నుండి స్పష్టత రాలేదు. కేవలం ఉద్యోగ సంఘాలు చెప్పిన విషయాలను వినడానికే ఈ సమావేశం పరిమితమైంది. 12వ పిఆర్‌సి ఛైర్మన్ నియామకంపట్ల స్పష్టతగానీ, కనీసం హామీ కానీ ఈ సమావేశంలో రాలేదు,. ఐఆర్ 30శాతం ప్రకటించే విషయంపై కూడా అదే పరిస్థితి నెలకొంది, దీంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన ప్రతి విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సిఎస్ చెప్పడం మినహా మరెటువంటి హామీ లభించలేదని అంటున్నారు.

బోధనేతర కార్యక్రమాలనుంచి వెసులుబాటు కల్పించాలి: యుటిఎఫ్

యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ ప్రసాద్‌లు మాట్లాడుతూ 25 నెలల క్రితం నియమించాల్సిన12వ పిఆర్‌సి ఛైర్మన్‌పై హామీ, స్పష్టత ఇవ్వకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ని రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపచేయకపోవడంతో నూతన పెన్షన్‌విధానంలో కొనసాగుతున్నారని తక్షణమే వారికి మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయకుండా బోధనేతర కార్యక్రమాలు ఇస్తూతీవ్ర వత్తిడికి గురి చేస్తున్నారని, బోధనేతర కార్యక్రమాల నుంచి వెసులుబాటు కల్పించాలని కోరారు. 1998,2008 డిఎస్‌సిలో ఎంపికైన మినిమమ్ టైమ్ స్కేల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వారి సర్వీస్ రెగ్యులర్ చేయడంతో పాటు వారి పదవీ విరమణ వయసు 62కు పెంచాలని కోరారు. పాఠశాల విద్యాశాఖలో ఉమ్మడి సర్వీసు రూల్స్ లేకపోవడంతో పంచాయతీరాజ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు కామన్ సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించాలని యుటిఎఫ్ నేతలు సిఎస్‌ను కోరారు. 10,667 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయడానికి ఉత్తర్వులిచ్చిందని, కానీ 3234మందిని మాత్రమే రెగ్యులర్‌చేసిందని, మిగిలిన అందరినీ మిగతా 7లో

ప్రతిపక్ష రాష్ట్రాలను కూల్చే కుట్ర

- మూడు రాజ్యాంగ సవరణ బిల్లులపై దద్దరిల్లిన లోక్‌సభ
- ఆందోళన మధ్యే బిల్లులు ప్రవేశపెట్టిన అమిత్ షా
- 'పిఎం, సిఎం, మంత్రుల' బిల్లు జెపిసికి
- ప్రతిపక్ష మహిళ ఎంపీలను నెట్టేసిన కేంద్రమంత్రులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన మూడు వివాదస్పద బిల్లులపై లోక్‌సభ దద్దరిల్లింది. సభలో తీవ్ర గందరగోళం నెలకుంది. సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ప్రతిపక్ష మహిళా ఎంపీలను కేంద్ర మంత్రులు నెట్టేశారు. దర్యాప్తు సంస్థలు అరెస్టు చేసి 30 రోజుల పాటు నిర్బంధంలో ఉంటే 31వ రోజే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు పోయేలా వీలు కల్పించే మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో కేంద్ర ప్రవేశపెట్టింది. ఈ బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసే కుట్రలో భాగంగానే ఈ బిల్లును మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని ఆరోపించాయి. ఈ ఆందోళనల నడుమే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. వివాదాస్పద బిల్లును ప్రవేశపెట్టే సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగ వ్యతిరేక బిల్లులంటూ, అవి ప్రతిపక్షాలపై కక్షపూరిత చర్యలకు ఉద్దేశించినవని ప్రతిపక్ష సభ్యులు బిల్లు కాపీలను చించి విసిరేశారు. ఈ సమయంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన మహిళా ఎంపీలను కేంద్రమంత్రులు నెట్టేశారని టిఎంసి ఎంపి కళ్యాణ్ బెనర్జీ విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం తరువాత సభలో ఈ గందరగోళం చేటుచేసుకుంది. అనంతరం వీటిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి సిఫారసు చేస్తూ తీర్మానం చేశారు.బుధవారం ముందుగా లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను వెనక్కి తీసుకోవాలని వెల్‌లోకి దూసుకెళ్లి, ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. సభ్యుల ఆందోళన మధ్యే కేంద్ర ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును మిగతా 7లో

ఆ మూడు బిల్లులు అప్రజాస్వామికం

- సిపిఎం పొలిట్ బ్యూరో

న్యూఢిల్లీ : 30 రోజుల పాటు కస్టడీలో వుంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులను పదవుల నుండి తొలగించేందుకై ఉద్దేశించిన మూడు బిల్లులను ప్రవేశపెట్టేందుకు మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా నిరసించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే అమల్లో వున్న చట్టపరమైన విధానాలను తప్పించుకునే ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులను ఈ బిల్లు నొక్కిచెబుతోందని పేర్కొంది. గతంలో కూడా బిజెపి ఇదే రకమైన ధోరణిని కనబరుస్తూ వచ్చిందని, జ్యుడీషియల్ పరిశీలనను తప్పించుకునేందుకు గానూ మొత్తంగా ఒక చట్టాన్ని తీసుకువచ్చే హేయమైన చర్యలను తీసుకుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వ నయా ఫాసిస్ట్ ధోరణులను దృష్టిలో వుంచుకుంటే, ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకునే ఆయుధంగా ఈ చట్టాన్ని ఉపయోగిస్తారని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ చర్య చాలా హీనమైనదని, ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన తనిఖీలు, సమతుల్యతలను దెబ్బతీస్తుందని విమర్శించింది. నేరం అని ప్రస్తావించడమనేది కేవలం వారి వాస్తవిక ఉద్దేశాలను కప్పిపుచ్చుకోవడానికి మిగతా 7లో

ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీల రాజకీయం

- ఉత్తర్వులలో అధికారపార్టీ ఎంఎల్‌సిలకు ప్రాధాన్యత
- తమను విస్మరించడం పట్ల సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంతో కాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న అంతర్‌జిల్లా బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత కారణాలను, ఆరోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకుని ఈ బదిలీలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే, టిడిపి ఎంఎల్‌సిలు వేపాడ చిరంజీవిరావు, పేరాబత్తుని రాజశేఖర్, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ తదితరులు ఈ నెల 14వ తేదిన ఇచ్చిన వినతి మేరకు ఈ బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని యుటిఎఫ్, ఎస్టియు, ఎపిటిఎఫ్‌లతో పాటు అనేక సంఘాలు రాష్ట్రప్రభుత్వానికి ఏడాది నుంచి వినతిపత్రాలు అందిస్తునే ఉన్నాయి. గతేడాది డిసెంబర్ 13వ తేదిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించారు. ఈ చర్చల సమయంలో కూడా అంతర్‌జిల్లా బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు మంత్రిని కోరాయి. సంఘాలతో పాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కూడా అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని పలుమార్లు వినతిపత్రాలు అందించారు. జులై 17వ తేదిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను, ఈ నెల 11వ తేదిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును కలిసి అంతర్ జిల్లాల బదిలీలు నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. ఇదే అంశంపై ఈ నెల 19వ తేది కూడా లోకేష్‌తో పాటు కమిషనర్‌కు కూడా లేఖ రాశారు. అంతర్ జిల్లాల బదిలీలపై యుటిఎఫ్ ఈ నెల 12వ తేదిన పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి లేఖ రాసింది. విద్యాశాఖ మంత్రి సంఘాలతో చర్చలు జరిపిన రోజే ఎస్టియు కూడా ఈ ప్రస్తావన తీసుకొచ్చింది. అయితే, ఈ విజ్ఞప్తులన్నింటిని పక్కన బెట్టి టిడిపి ఎంఎల్‌సి పేర్లు మాత్రమే ఉత్తర్వులలో పేర్కొనడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. బదిలీలపై తాము కూడా ప్రాతినిధ్యం వహించామని, అయినా తమ ఉత్తర్వులను రిఫరెన్స్‌లో పెట్టకపోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రస్తావించారు.

'వ్యూహం' నిర్మాత దాసరి కిరణ్ అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



'వ్యూహం' సినిమా నిర్మాత దాసరి కిరణ్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో నమోదైన ఫిర్యాదుతో విజయవాడ పటమట పోలీసులు ఆయనను బుధవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అనంతరం విజయవాడకు తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం... హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న దాసరి కిరణ్ బంధువు గాజుల మహేశ్ ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయన వద్ద నుంచి కిరణ్ రూ.4.5 కోట్లు అప్పుగా తీసుకున్నారు. తిరిగి ఇవ్వాలని మహేశ్ అనేకసార్లు అడిగినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 18న తనపైన, తన భార్యపైన కిరణ్ అనుచరులు దాదాపు 15 మంది దాడి చేసినట్లు విజయవాడ పటమట పోలీసులకు మహేశ్ ఫిర్యాదు చేశారు. దీంతో దాసరి కిరణ్‌కు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఎన్‌డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సిపి రాధాకృష్ణన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌డిఎ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా ప్రధాని మోడీ సంతకం చేశారు. దీనికి ముందు ప్రేరణా స్థల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయులు (టిడిపి), లలన్ సింగ్ (జెడియు), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జెపి), అనుప్రియ పటేల్ (అప్నాదల్), తంబిదొరై (అన్నాడిఎంకె), రాందాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), కుమారస్వామి (జెడిఎస్), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి-అజిత్ పవర్), జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డి), శ్రీకాంత్ షిండే (శివసేన-షిండే) తదితరులు పాల్గొన్నారు.

నేడు సుదర్శన్ రెడ్డి నామినేషన్

గురువారం ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నేతలంతా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాగా సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ప్రక్రియతో ఎన్నిక నిర్వహిస్తారు.

పెరిగిన గోదావరి నీటి మట్టం

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రజలు

ప్రజాశక్తి - యంత్రాంగం

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్ర రూపం దాల్చుతోంది. మొదట ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు 43 అడుగులకు చేరుకోగానే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు 45.10 అడుగులకు, ప్రస్తుతం 46.5 అడుగుల నీటిమట్టం నమోదైంది. రాత్రికి 48 అడుగుల వరకు చేరుకొని అనంతరం తగ్గుముఖం పట్టొచ్చు అని అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజ్ వద్ద 10.40 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి 8,08,346 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 8,78,421 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.100 మీటర్లు, స్పిల్ వే దిగువన 23.520 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. వేలేరుపాడు మండలంలో రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము గ్రామాల వద్ద గోదావరి ఒడ్డును ఆనుకుని ప్రవహిస్తోంది. రుద్రమకోట, వేలేరుపాడు నుంచి నుంచి కోయిదా వెళ్లే మార్గంలో ఎక్కడికక్కడ వాగులు ఉప్పొంగడంతో నాళ్లవరం, ఎడవల్లి, టేకూరు, కోయిదా, కాచారం తదితర 20 గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పునరావాస కాలనీకి తరలిపోతున్న ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము వాసులు

సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రజలు

ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామంలో సుమారు 50 కుటుంబాలను చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీకి, నెమలిపేటలోని ఆర్అండ్ఆర్ కాలనీకి తరలించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేశామని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ చెప్పారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే నీట మునగ్గా, బుధవారం ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై కాజ్‌వేను వరద నీరు ముంచెత్తింది. దీంతో మరో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వరద మరింత పెరిగితే కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు ఎ బ్లాక్‌కు చెందిన కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాల్సి ఉంటుంది.

శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత

శ్రీశైలం జలాశయం పది గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 4,19,790 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 885 అడుగులకు గాను 881.80 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 197.9120 టీఎంసీలుగా నమోదైంది. ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 4,64,064 కొనసాగుతుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు 70 గేట్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 13.1 అడుగులుగా ఉంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వినాయక ఉత్సవాల అనుమతుల కోసం వెబ్‌సైట్

- డి జిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినాయక ఉత్సవ మండపాల నిర్వాహకులు, సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందేందుకు వీలుగా రాష్ట్ర పోలీస్ శాఖ ganeshutsav.net వెబ్‌సైట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్టు రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక ఉత్సవ మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో తమ తమ వివరాలను నమోదు చేసుకుని ఎన్‌ఓసి (నిరంభ్యంతర పత్రం) పొందవచ్చున్నారు. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి మండపా లు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వినాయక ఉత్సవ మండపాలకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసి జారీ చేస్తారని డిజిపి పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలకు మాత్రమే ఈ అనుమతులు అవసరమని, ఈ సేవలు పూర్తిగా ఉచితమని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

25 నుంచి ఆయుష్ లైసెన్స్‌ల పునరుద్ధరణ మేళాలు

- డైరెక్టర్ కె.దినేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ లైసెన్స్ పునరుద్ధరణకు ఆయుష్ శాఖ ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహిస్తుందని ఆ శాఖ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 25 నుంచి ఈ మేళాలు జరుగుతాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి ఏలూరులోని ఆయుష్ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఒంగోలులోని ఆయుష్ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో వచ్చే నెల 1, 2వ తేదీలో ఈ మేళాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి కర్నూలు, వైఎస్ఆర్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల వారు వచ్చే నెల 8, 9వ తేదీల్లో కడపలోని ఆయుష్ ప్రాంతీయ ఉపసంచాలకుల కార్యాలయంలో మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ పునరుద్ధరించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుష్ అదనపు డైరెక్టర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సిబ్బంది హాజరువుతారని వెల్లడించారు.

విశ్రాంత ఎస్ఇసిలకు వసతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లకు, హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు అందించే వసతులు, ప్రయోజనాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి అందించిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లకు, జీవిత భాగస్వాములకు హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు అందించే విధంగా డొమెస్టిక్ హెల్ప్ కోసం ప్రభుత్వం నెలకు రూ.45 వేలు రీఎంబర్స్ చేసేందుకు, సెక్రెటేరియల్ హెల్ప్, టెలిఫోన్, సెక్యూరిటీ, ఇంటర్నెట్ వంటి సౌకర్యాల కోసం రూ.15 వేలు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ లబ్ధిపొందేందుకు వారు ఇతర శాఖల నుంచి ఇటువంటి సౌకర్యాలు పొంది ఉండకూడదని స్పష్టం చేశారు.

నవ వధువు ఆత్మహత్య

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

పెళ్లయిన మూడు రోజులకే నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణం ఉండవల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఉండవల్లికి చెందిన రంగనాయకమ్మ(24)కు స్థానికంగా ఉండే తన బంధువైన జశ్వంత్‌తో ఈనెల 18న వివాహమైంది. అత్తగారింట్లో బుధవారం ఉదయం దుస్తులు మార్చుకునేందుకు గదిలోకి వెళ్లిన రంగనాయకమ్మ ఉరేసుకుని మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండండి

- పార్టీ నాయకత్వానికి సజ్జల సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై నాయకత్వం అప్రమత్తంగా ఉండాలని పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం నుండి ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో నాయకత్వంతో మాట్లాడారు. పోలింగు బూత్‌లలో ఓటర్ల సంఖ్యను బట్టి ఓటర్లను మారుస్తుంటారని, ఇటువంటి అంశాలపై అవగాహనతో ఉండాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తతో వ్యవహరించాలని, ఏమరుపాటు ఉండకూడదని పేర్కొన్నారు. బూత్ కమిటీలను నియమించుకోవడం అత్యంత ప్రధానమని వివరించారు. ఓటర్ లిస్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బిఎల్‌ఏ నియామకంపై ఇప్పటి నుండి పనిలో దిగాలని అన్నారు. 20 బూత్‌ల పరిధిలో ఒక సీనియర్ లీడర్‌ను నియమించుకుని టాస్కుఫోర్స్ టీములాగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటర్ల లిస్టులో ఏ మార్పు జరిగినా వెంటనే తెలుస్తుందని వివరించారు. బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ పథకంపై అందరూ పనిచేయాలని, అధ్యక్షుడు జగన్ దీనిపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్ల విషయంలో పార్టీ సూచనలు అందరూ పాటించాలని అన్నారు.

రాజధాని మునిగిందని నారాయణ అంగీకరించారు
అంబటి మురళీకృష్ణ, వేమారెడ్డి

అమరావతి వరదను కృష్ణానది పశ్చిమ కాలువలో పంప్ చేశామని ప్రభుత్వమే చెప్పిందని వైసిపి నాయకులు అంబటి మురళీకృష్ణ, దొంతిరెడ్డి వేమారెడ్డి, డైమండ్‌బాబు తెలిపారు. కొండవీటివాగు ఇన్‌టేక్ నుండే కొండవీటివాగు మొదలవుతుందని వివరించారు. కొండవీటివాగు నాలుగు ఉప వాగులనూ డైవర్ట్ చేశారని అన్నారు. వరద ప్రవాహానికి శాశ్వత పరిష్కారం చూపకుండా రాజధాని నిర్మాణం పూర్తి కాదని అన్నారు.

మెగా డిఎస్‌సిలో కూటమి సర్కార్ దగా

మెగా డిఎస్‌సి ఫలితాల వెల్లడిలో కూటమి సర్కార్ దగా చేసిందని, మెరిట్ లిస్టు విడుదల చేయకుండా అభ్యర్థులకే మెసెజేస్‌లు చేయడం ద్వారా టీచర్ పోస్టులను అమ్ముకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య, రవిచంద్ర అన్నారు. గతంలో రిజర్వేషన్ కోసం రోస్టర్ కింద జాబితాలు వెల్లడించేవారని, ఇప్పుడు అటువంటి పద్ధతి లేకుండా చేశారని అన్నారు.

ఎఐ ద్వారా రెండు గంటల్లో దర్శనం: టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిటిడిలో హిందూయేతరులైన ఉద్యోగులను దశలవారీగా తొలగిస్తామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు చెప్పారు. ఎఐ ద్వారా సామాన్య యాత్రికులకు రెండు గంటల్లో శ్రీవారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో బిఆర్ నాయుడు మాట్లాడుతూ...సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో అన్నదాన కార్యక్రమం నిరంతరం కొనసాగుతోంది. ఇందు కోసం రూ.నాలుగు కోట్లు కేటాయించాం. గత పాలనలో 12 మంది వైసిపి వాళ్లకు తిరుమలలో హోటళ్లు ఇచ్చారు. ప్రస్తుతం ఈ- టెండర్ల ద్వారా హోటళ్లు కేటాయించాం. తిరుమలలో త్వరలో కొత్త క్యాంటీన్లు ప్రారంభిస్తాం. శ్రీవాణి దర్శన సమయాల వేళలు మారుస్తున్నాం. సైబర్ మోసాలు అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. ఏడాది కాలంలో 30వేల నకిలీ వెబ్‌సైట్లను క్రాష్ చేశాం. మత మార్పిడులు జరగకుండా ఆలయాలు నిర్మించాలని నిర్ణయించాం. ఆలయాల విషయమై మిగిలిన రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాశాం. మిగతా రాష్ట్రాలు భూమి ఇవ్వగానే ఆలయాల నిర్మాణం చేపడతాం. వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలను భ్రష్టు పట్టిస్తున్నారు. కరుణాకర్‌రెడ్డి అవినీతి చిట్టా అంతా నా దగ్గర ఉంది. టూరిజం ముసుగులో వైసిపి నేత రోజా ఒక్కో దర్శన టికెట్ రూ.ఐదు వేలకు అమ్ముకున్నారు' అని అన్నారు.

17 మంది ఎపిపిల తొలగింపు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

వైసిపి ప్రభుత్వ హయాంలో నియమితులై ఇప్పటికీ పనిచేస్తున్న మొత్తం 17 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి)లనూ తొలగించాలని ప్రాసిక్యూషన్ డైరెక్టర్ చేసిన సిఫార్సు మేరకు వీరిపై వేటు పడింది. వీరిలో కర్నూలు సెషన్స్ కోర్టులో పిపి వెంకటరెడ్డి, ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో పిపి వసుంధర, కర్నూలు జిల్లా ఆత్మకూరు కోర్టులో అసిస్టెంట్ పిపి అసిఫ్ ఆలీఖాన్, కర్నూలు నాలుగో అడిషనల్ జిల్లా సెషన్ కోర్టు ఎపిపి ప్రకాశ్‌రెడ్డి, కర్నూలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఎపిపి బాల రంగస్వామి, అనంతపురం జిల్లా గుత్తి నాలుగో అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డి, కడప ఏడో అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న మొఘల్ ఎస్మిన్ బేగం, కడప జిల్లా 6వ అడిషనల్ డిస్టిక్ సెషన్స్ కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న ప్రతాప్ కుమార్‌రెడ్డి, మదనపల్లి కోర్టులో ఎపిపిగా ఉన్న వి.జయనారాయణరెడ్డి, రాయచోటి ఐదో అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో ఎపిపిగా ఉన్న టి.జగన్మోహన్‌రెడ్డి, మచిలీపట్నం అడిషనల్ జడ్జి కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న సియాద్రి చిన్నారావు, గుడివాడ 11వ అదనపు డిస్ట్రిక్ సెషన్స్ కోర్టులో ఎపిపిగా పనిచేస్తున్న షేక్ రెహ్మతుల్లా, నెల్లూరు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఎపిపిగా ప్రసాదరావు ఉన్నారు.

వీరిపై తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు కోర్టుల్లో ముగ్గురు ఎపిపిలను ముందస్తు నోటీసులతో తొలగిస్తూ రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టులో పనిచేస్తున్న పల్లపు కృష్ణ, ఫ్యామిలీ కోర్టులో పనిచేస్తున్న బి.కోటేశ్వరరావు, నాల్గో అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో పని చేస్తున్న జ్యోత్స్న ఉన్నారు.

విశాఖ ఉక్కును ముక్కలు చేసి అమ్మేస్తున్నారు

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముక్కలు చేసి అమ్మేస్తున్నాయని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఉక్కు నిర్వాసితుల సంఘం ప్రతినిధి మహదేవ్ అన్నారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దీనివల్ల 18 వేలమందికి శాశ్వత ఉద్యోగాలు, 32 వేలమందికి కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. 800 అనుబంధ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు. ఉక్కు ప్రభుత్వానికి 1.25 లక్షల కోట్లు వేర్వేరు రూపాల్లో చెల్లించిందని అన్నారు. 30 ఏళ్లపాటు నిరాటంకంగా లాభాల్లో నడిచిందని వివరించారు. రూ.30 వేల కోట్ల కేంద్రం ఆర్థిక సాయం అందిస్తే ప్లాంటు లాభాల్లో నడిచేదని పేర్కొన్నారు. సొంత గనులు లేకపోయినా వృద్ధి చెందిన ప్లాంటు విశాఖ ఉక్కన్నారు. ప్రైవేటు కంపెనీలకు రూ.16 లక్షల కోట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేసిన కేంద్రం విశాఖ ఉక్కు అప్పు రూ.30 వేల కోట్లను మాఫీ చేయకపోవడం అన్యాయమని వారు తెలిపారు. బైలదిల్లా ఘనుల నుండి వచ్చే ఇనుప ఖనిజాన్ని ఉద్దేశ పూర్వకంగా ఆపేశారని వివరించారు. సొంత గనులు ఇవ్వడానికి కేంద్రానికి చేతులు రావడం లేదని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా నుండి ముడి సరుకును ప్లాంటు యాజమాన్యం అడిగిందని, కూటమి ప్రభుత్వం ఈ ఘనులను జెఎస్‌డబ్ల్యు ప్లాంటుకు ఇవ్వడానికి నిర్ణయించిందని పేర్కొన్నారు. అంతకుముందు కేటాయించిన గనులను రద్దు చేశారని తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే ప్లాంటును నష్టాల బ్టా పట్టించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నిందని వివరించారు. అన్ని రూపాల్లోనూ ప్లాంటును నష్టపరుస్తూ నక్కపల్లిలో మిట్టల్ స్టీలుకు 5000 ఎకరాలు భూమిని అప్పగించిందని అన్నారు. ఇచ్చిన రూ.11 వేల కోట్లు కూడా గతంలో ఉన్న బకాయిలు చెల్లించి కొనుగోలు చేసే వ్యక్తులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే వ్యవహారం నడిపారని అన్నారు.

యుపిహెచ్‌సి ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు

- యుపిహెచ్‌సి ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న ఉద్యోగులకు వైద్య ఆరోగ్య శాఖలో ఇతర కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జెఎసి చైర్మన్ ఎ.వి నాగేశ్వరరావు కోరారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 686 జిఒ ప్రకారం యుపిహెచ్‌సి ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు చేపట్టే కార్యక్రమాలకు మద్దతు తెలిపారు. ఈ నెలలో అన్ని జిల్లాల్లో ఉద్యోగుల సమావేశాలు నిర్వహించాలని, సెప్టెంబరులో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని, అక్టోబరు నెలలో ఉద్యోగులందరి సంతకాలతో విజయవాడలో ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయాలని రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా కార్యచరణ అమలుకు తీర్మానించిందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం తెలిపారు. సమావేశానికి 15 జిల్లాల నుంచి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, ఇతర నాయకులు హాజరయ్యారు.

అరుణకు 14 రోజుల రిమాండ్

- ఒంగోలు కోర్టుకు తరలింపు

ప్రజాశక్తి - కోవూరు

జీవిత ఖైదు శ్రీకాంత్ పెరోల్ విషయంలో వివాదం ఎదుర్కొంటున్న నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన అరుణను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రాత్రి అద్దంకి టోల్ ప్లాజా వద్ద ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు కోర్టులో ఆమెను హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. తొలుత కావలి సబ్ జైలుకు తరలించారు. అక్కడ మహిళలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో అక్కడి నుంచి ఒంగోలు జైలుకు తరలించారు. తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ యజమానిని బెదిరించి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేసిన విషయంలో ఆమెపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌ను తిరుపతి రూయా ఆసుపత్రికి తీసుకెళ్లిన సమయంలో విధులు నిర్వహించిన ముగ్గురు ఎఆర్ కానిస్టేబుళ్లను ఎస్‌పి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. విధులు నిర్వహించే సమయంలో నిర్లక్ష్యంగా ఉన్నారని, ఖైదీని స్వేచ్ఛగా వదిలేశారనే విషయం బయట పడడంతో ఈ మేరకు వారిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ఆర్‌టిసి స్థలాల లీజు ద్వారా ఆదాయం సముపార్జన

- రెండేళ్లలో పల్లెవెలుగు బస్సుల్లో కూడా ఎసి సౌకర్యం
- మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిని బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీశక్తి) పథకం ప్రవేశపెట్టి ఆరు రోజుల్లో 65లక్షల మంది మహిళలు సద్వినియోగం చేసుకున్న నేపథ్యంలో బుధవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండు కాన్ఫరెన్స్ హాలులో ఆయన అధికారులతో సక్సెస్‌మీట్ నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం సూపర్ సక్సెస్ అయ్యిందని చెప్పారు. మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు పథకంభారం కాదని అది ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు.

ఆర్‌టిసి స్థలాలను లీజుకిచ్చి ఆదాయం సమకూర్చుకుంటామని, కార్గో సేవలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని సేవలను విస్తృత పరుస్తామన్నారు. మరో రెండు సంవత్సరాల్లో పల్లె వె లుగు బస్సులను సైతం ఎసి బస్సులుగా మారుస్తామని తెలిపారు.

మహిళా ప్రయాణీకుల భద్రత పరంగా రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వానికి కార్మికులు, ప్రయాణీకులు రెండు కళ్ల లాంటి వారని మంత్రి స్పష్టం చేశారు. తిరుమల ఘాట్ రోడ్డులో ఉచిత ప్రయాణం సాధ్యాసాధ్యాలపై ఆలోచన చేస్తున్నామని సాంకేతిక సమస్యలను పరిష్కరించిన అనంతరం త్వరలోనే తిరుమలకు ఉచిత బస్సు ప్రయాణంపై అనుకూల ప్రకటన వస్తుందన్నారు.

రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మ రో వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అతి త్వరలో కండక్టర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో 750 విద్యుత్తు బస్సులు తీసుకురానుందని, మరో నాలుగేళ్లలో 2,500లకు పైగా నూతన విద్యుత్తు బస్సులు కొనుగోలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసే బస్సులన్నీ ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయన్నారు. మీడియా సమావేశంలో ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్లనారాయణ, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అధికారులు పాల్గొన్నారు.

15 రోజుల్లోగా ఇళ్లు లేని పేదల జాబితా

- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సొంత ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించేందుకు 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేసి, జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను కూడా గుర్తించాలన్నారు. ఇప్పటికే ప్రారంభమైన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సచివాలయంలో బుధవారం గృహ నిర్మాణశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. 2026 మార్చి కల్లా 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. వీటిలో మూడు లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. సంక్రాంతి నాటికి మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టులను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించాలని, పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, గృహనిర్మాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, డైరెక్టర్ శివప్రసాద్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు

టిడ్కో ద్వారా నిర్మిస్తున్నవాటిలో 84,904 ఇళ్లు తుది దశకు చేరాయని అధికారులు సిఎంకు తెలిపారు. 2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వీటిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 12,550 ఇళ్లు 430 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు కలిపి మొత్తం 84,094 ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం అందించినట్లు అధికారులు సిఎంకు తెలిపారు.

డయాఫ్రంవాల్ పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణపు పనులను, మెటీరియల్ పరీక్షల ల్యాబ్‌లను కేంద్ర మట్టి రాతి నాణ్యతా పరిశీలనా విభాగం శాస్త్రవేతలు లలితకుమార్ సోలంకి, హనుమాన్ ప్రసాద్ మీనా బుధవారం పరిశీలించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న బృందం మూడు రోజులుగా డయాఫ్రంవాల్ నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతా ప్రమాణాలు, మెటీరియల్ నాణ్యతను ల్యాబ్‌లో పరీక్షించారు. డయాఫ్రం వాల్ నిర్మాణంలో అధికారులకు పలు సూచనలు చేశారు. గడిచిన మూడు రోజుల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బృందం నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. వారి వెంట ఇఇ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ ఇఇ ప్రేమచంద్, ఇంజనీరింగు సిబ్బంది ఉన్నారు.

నేడు 'డిఎస్సి' మెరిట్ లిస్ట్?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సి మెరిట్ లిస్ట్ గురువారం విడుదల కానుంది. మెరిట్ లిస్ట్‌తో పాటు అభ్యర్థుల ధ్రువపత్రాల షెడ్యూల్, నియామకాల షెడ్యూల్‌ను కూడా విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్రప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్సి ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించిన పాఠశాల విద్యాశాఖ పరీక్షల తుది 'కీ'ని విడుదల అభ్యర్థుల స్కోరు కార్డుల విడుదల ప్రక్రియను ఈ నెల 15వ తేదీతో పూర్తిచేసింది. మెరిట్ జాబితా లేకుండానే నేరుగా ధ్రువపత్రాల పరిశీలన చేయాలని పాఠశాల విద్యాశాఖ ముందుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వస్తుందనే కారణంతో మరలా తన నిర్ణయాన్ని మార్చుకునట్లు సమాచారం.

అభ్యంతరాలకు నేడే ఆఖరి అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్సి-2025 కార్డులలో టెట్ మార్కుల అభ్యంతరాలకు గురువారమే ఆఖరి అవకాశమని మెగా డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి తెలిపారు. అభ్యంతరాల తరువాత సవరించి టెట్ మార్కులతో అనుసంధానించిన స్కోర్‌కార్డులను https://apdsc.apcfss.in/ వెబ్‌సైట్‌లో ఉన్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ మార్కులలో అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చామని పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 12గంటలలోపు సరిచేసుకోవాలని వెల్లడించారు.

కౌలు రైతుల పంట రుణాల లక్ష్యాలను సవరించాలి

- ఎపి కౌలు రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కౌలు రైతుల పంట రుణాల లక్ష్యాన్ని సవరించాలని, ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 32 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని, వారిలో 10 లక్షల మంది సొంత భూమి లేని కౌలు రైతులుగా ఉన్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరి బాబులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 32 లక్షల మందికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయడంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల వైఫల్యం ఉందని తెలిపారు. ఈ ఏడాది సిసిఆర్‌సి గుర్తింపు కార్డులు 10 లక్షలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొగా ఇప్పటి వరకూ కేవలం 6 లక్షల మందికే ఇచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని వివరించారు. లక్ష్యాలు నిర్ధారించుకోవడం, కార్డులు జారీ చేయడంలో లోపం కనిపిస్తుందన్నారు. ఈ ఏడాది వ్యవసాయ రుణ ప్రణాళికలో రూ.4 లక్షల కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే లక్ష్యంగా నిర్ణయించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో 80 శాతం మంది కౌలు రైతులు ఉన్నందున కనీసం రూ.3 లక్షల కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. మరోవైపు ఇప్పటి వరకూ రూ.838 కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వడం లక్ష్యంలో 10 శాతం కూడా చేరుకోలేకపోయారని తెలిపారు. వ్యవసాయాన్ని ఆదుకునే విధంగా లక్ష్యాలను సవరించాలని కోరారు. పంట వేసిన ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలతో, అధికారులు, బ్యాంకర్లుతో సంయుక్త సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న టాస్క్ ఫోర్స్ ఎస్‌పి

రెండు టన్నుల ఎర్రచందనం పట్టివేత

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

శేషాచలం అడవుల నుంచి అక్రమంగా తరలిస్తున్న దాదాపు రెండు టన్నుల ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లరును అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి శ్రీనివాస్ మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు.. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో కావలి పోలీసుల సహాయంతో కె.బిట్రగుంట ఫారెస్ట్ బీటు పరిధిలో వాహన తనిఖీలను నిర్వహించారు. రెండు కార్లు, ఒక లారీ వేగంగా రావడానికి గమనించి, ఆపేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్లు యూ టర్న్ తీసుకున్నాయి. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిపైకి లారీ దూసుకు వచ్చింది. పోలీసులు అప్రమత్తమై లారీని వెంబడించి పట్టుకున్నారు. లారీలో ఉన్న దుండగులు పారిపోతుండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హర్యానాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీలో మొత్తంగా 83 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించామని, వీటి విలువ దాదాపు రూ. రెండు కోట్ల రూపాయలు ఉంటుందని ఎస్‌పి తెలిపారు.

నల్లజర్లలో ఘాతుకం

- అత్తమామలను హత్య చేసిన అల్లుడు

ప్రజాశక్తి - నల్లజర్ల(తూర్పు గోదావరి)

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో ఒక దుండగుడు ఘాతుకానికి పాల్పడ్డాడు. భార్యను కాపురానికి పంపలేదంటూ సొంత అత్తను, మామను హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన ఏకుల బాబూరావు (56), శారద (47) దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె నాగేశ్వరికి 15 ఏళ్ల క్రితం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మరీదు కోటేశ్వరరావుతో వివాహం చేశారు. భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో కలిసి నాగేశ్వరి పుట్టింటికి వచ్చారు. ఏడాది అయిన తన భార్యను కాపురానికి పంపలేదని ఇటీవల అత్తమామలతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో అత్తింటికి వచ్చి కోటేశ్వరరావు తొలుత శారదపై మారణాయుధంతో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. అడ్డుకోబోయిన బాబూరావుపైనా దాడి చేయడంతో ఆయన మరణించారు. దారుణాన్ని గమనించిన నాగేశ్వరి ఇంటిలోపలకి వెళ్లి గడియపెట్టుకున్నారు. స్థానికులకు సమాచారం అందివ్వడంతో వారు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

చివరి ఆయకట్టుకు చుక్కనీరూ కరువే

- రాజాం, బొబ్బిలి, పార్వతీపురం వరకే 'తోటపల్లి'
- నెల్లిమర్ల, చీపురుపల్లికి చేరని వైనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తోటపల్లి జలాశయం నిండా నీరు ఉన్నప్పటికీ, చివరి ఆయకట్టుకు మాత్రం అందడం లేదు. 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా 25వేలకు మించి సాగునీరు అందడం లేదు. దీంతో, తోటపల్లి నీటికోసం ఎదురు చూస్తున్న చివరి ఆయకట్టుదారులకు ఈ ఏడాది కూడా నిరాశే ఎదురైంది. ముఖ్యంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాలకు చుక్కనీరు రావడం లేదు. 64 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తూనే 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి బ్యారేజీ సామర్థ్యాన్ని పెంచి, కుడికాలువ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందుకనుగుణంగానే నాగావళి నది నుంచి జలాశయంలోకి నీటి ప్రవాహం కొనసాగుతోంది. కానీ, కాలువల మిగులు పనులు పూర్తి చేయకపోవడం, కుడి ప్రధాన కాలువ నిర్వహణ గాలికి వదిలేయడంతో ఏటా సాగునీటి సరఫరా తగ్గిపోతోంది.

2004లో చేపట్టిన ఈ జలాశయ నిర్మాణం ద్వారా 2015 ఖరీఫ్ సీజన్‌లో తొలిదశ నీరు అందించారు. నాటి నుంచి 2018 వరకు సుమారు 86 వేల ఎకరాలకు సాగునీరు లభించేది. దీంతో, శివారున ఉన్న గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలకు సైతం నీరు అందేది. వందలాది చెరువుల్లో నీరు నింపడంతో వరిపంటలు పుష్కలంగా పండేవి. ప్రాజెక్టు కాంట్రాక్టు కాలపరిమితి 2017తో పూర్తికావడంతో ప్రభుత్వం కాలువల నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో, కాలువలో పూడిక పేరుకుపోయింది. సువర్ణముఖి - వేగావతి నదుల క్రాసింగ్, బాతువ రైల్వే క్రాసింగ్ సహా పలుచోట్ల వేసిన లైనింగ్ పనులు దెబ్బతిన్నాయి. ఆ డెబ్రిస్ అంతా ప్రధాన కాలువలో పడిపోయింది. ఈనేపథ్యంలో క్రమంగా సాగునీటి సరఫరా తగ్గుతూ వస్తోంది. గరుగుబిల్లి, సీతానగరం, బొబ్బిలి మండలాల పరిధిలో కుడికాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ తెర్లాం, రాజాం వరకు వచ్చేపాటికి తగ్గిపోతోంది. చీపురుపల్లి, నెల్లిమర్ల మండలాలకు చుక్కనీరు రావడం లేదు. గడిచిన మూడు రోజులుగా కురిసిన వర్షపు నీటితోనే రైతులు ఉబాలు పట్టుకుంటున్నారు. అధిక వర్షాలు, తుపాన్లు వస్తేనే వరి సాగుచేసుకుంటున్నామని, లేదంటే తమ భూములు బీడువారుతున్నాయని పూసపాటిరేగ మండలం ఆర్‌జిపాలేనికి చెందిన గేదెల సీతబాబు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికీ ఉబాలు పట్టుకోలేక పోయామని ఇదే మండలం కందివలసకు చెందిన మరికొంతమంది రైతులు వాపోయారు.

పూసపాటిరేగ మండలం నక్కానిపేట వద్ద నీరులేని తోటపల్లి కాలువ

ప్రభుత్వాలు మారినా పట్టించుకోవడం లేదు

పాలకులు, ప్రభుత్వాలు మారినా సాగునీటిని అందించేందుకు చొరవ చూపడం లేదు. పూసపాటిరేగ మండలానికి 2017 నుంచి 2018 వరకు తోటపల్లి నీరు అందేది. ఆ తరువాత చుక్కనీరు రావడం లేదు. నాడు వచ్చిన నీరు నేడు రావడం లేదంటే ప్రభుత్వానిది, స్థానిక ప్రజాప్రతినిధులదే లోపం.

కూనిశెట్టి గోవిందరావు
కదిమెళ్ల గ్రామం, పూసపాటిరేగ మండలం

ఈ ఏడాది 25 వేల ఎకరాలు సాగు

పూడిక తీతకు రూ.15 కోట్లు, లైనింగ్ పనులకు రూ.వంద కోట్లు అవసరం కానున్నట్లు గడిచిన మూడేళ్లగా అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలకు పరిమితమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది ఈపాటి నీరు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ప్రాజెక్టు పనులు పూర్తికి రూ.519 కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.47.81కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఆచరణలో నిధుల విడుదల అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. దీంతో, పిల్లకాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉన్నాయి.

'ఉక్కు'పై టిడిపి కూటమి నేతల వంచన

- నాడు ప్రయివేటీకరణను అడ్డుకుంటామని చెప్పి..ఇప్పుడు సమర్థనలా?
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఆగ్రహం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అధికార టిడిపి కూటమి నేతలు సమర్థిస్తుండటం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని, కేంద్ర ప్రభుత్వ చర్యలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మొండిగా సమర్థిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కానివ్వబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు నేడు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను పూర్తిగా సమర్థిస్తున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 34 విభాగాలుగా చేసి ఆపరేషన్, మెయింటెనెన్స్ మొత్తం పనులను కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఈ నెల 16న ప్రకటన ఇచ్చారని తెలిపారు. దీనివల్ల పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఆఫీసర్లతో సహా మొత్తం పనులన్నీ కొత్త కాంట్రాక్టర్లకు అప్పగిస్తారని పేర్కొన్నారు. స్థానికులుగా ఉన్నవారందరూ పూర్తిగా పనులు కోల్పోతారని, గాజువాక ప్రాంతం ఎడారిగా మారిపోనుందని ఆవేదన వ్యక్తంచేశారు. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వ సాయంతో కేంద్ర ప్రభుత్వం ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకుండా ఏకపక్షంగా తొలగించారని తెలిపారు. రెండు దఫాలు విఆర్ఎస్ పేరుతో నైపుణ్యం కలిగిన ఆఫీసర్లు, కార్మికులను బయటకు గెంటివేస్తున్నారని విమర్శించారు. కార్మికులను భయపెట్టి ప్రయివేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటివరకు బిజెపి చేసిన తప్పుడు వాదనలను టిడిపి నాయకులు భుజానవేసుకొని వాదనలు చేస్తున్నారని విమర్శించారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు/ఆత్మకూరు

గిరిజనుల అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శ్రీశైలంలో ట్రైబల్ చెంచు మ్యూజియం ప్రాంగణంలో గిరిజనుల ఉత్పత్తుల విక్రయశాల, గిరిజన బజారుకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడు ఐటిడిఎలకు రూ.ఏడు కోట్ల నిధులను కేటాయించామని, శ్రీశైలంలో కూడా గిరిజనులు అటవీ ఉత్పత్తులను అమ్ముకోవడానికి రూ.కోటి నిధులతో గిరిజన బజార్ దుకాణాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఏడాదిలోనే ఐటిడిఎలకు రూ.పది కోట్ల నిధులను మంజూరు చేశామని చెప్పారు. శ్రీశైలంలో గిరిజన ఉత్పత్తుల విక్రయ శాఖల వల్ల 1,500 మందికి పైగా ఉపాధి దొరుకుతుందన్నారు. శ్రీశైలం ఐటిడిఎ పరిధిలో 43 చెంచుగూడాల్లో కరెంటు, తాగునీటి సౌకర్యం, 102 పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు త్వరలో మెరుగుపరుస్తామని తెలిపారు. అనంతరం ఆత్మకూరు వెంగల్ రెడ్డి నగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన నన్నారి తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో నన్నారి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

రొయ్య ఉత్పత్తులకు దేశీయ మార్కెట్ కల్పించాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు డిమాండ్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ (కృష్ణా జిల్లా)

రొయ్య ఉత్పత్తులకు దేశీయ మార్కెట్ సదుపాయం కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల సమస్యలపై కృష్ణా జిల్లా మచిలీపట్నం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ.... రొయ్య ఎగుమతులపై విదేశాలు విధిస్తున్న సుంకాలకు చెంపపెట్టుగా దేశీయ మార్కెట్‌ను విస్తృత పరచాలని డిమాండ్ చేశారు. రొయ్యల సాగులో విత్తనం, మేతకు సంబంధించిన పరిశ్రమలు రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి ఉన్న వారి చేతుల్లో నడుస్తున్నాయని, దీనివల్ల పెరుగుతున్న విత్తనం, మేతల ధరలను ప్రభుత్వం నియంత్రించలేకపోతుందని విమర్శించారు. రొయ్యల రైతులకు గతంలో మాదిరిగా విద్యుత్ సబ్సిడీ కల్పించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు మాట్లాడుతూ.. జిల్లాలో రొయ్యల సాగు ఎక్కువగా చేపడుతున్న కృత్తివెన్ను, బంటుమిల్లి, కోడూరు అవనిగడ్డ, నాగాయలంక, నందివాడ, గుడివాడ ప్రాంతాల్లో ఆక్వా రైతుల ప్రయోజనాల కోసం సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రమణ్యం, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కే శివ నాగేంద్రం, ఆక్వా రైతు సంఘం నాయకులు రావి వెంకటరావు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

విజయవాడలో 'యుఅండ్ఐ'

విజయవాడ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ యుఅండ్ఐ విజయవాడకు తన కార్యకలాపాలను విస్తరించినట్లు తెలిపింది. ఇక్కడి ఎన్‌టిఆర్ కాంప్లెక్స్, గవర్నర్ పేటలో యుఅండ్ఐ తమ తొలి ప్రత్యేక రిటైల్ స్టోర్‌ను తెలుగు నటి నభా నటేష్ లాంచనంగా ప్రారంభించారు. ఈ స్టోర్‌లో ఆడియో పరికరాలు, బ్యాటరీలు, మొబైల్ యాక్సెసరీలు, లైఫ్‌స్టైల్ గాడ్జెట్‌లు అందుబాటులో ఉంటాయని యుఅండ్ఐ డైరెక్టర్ పరేష్ విజ్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌లో యుఅండ్ఐ బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ వినియోగదారులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించనున్నామని యుఅండ్ఐ స్థానిక రిటైల్ భాగస్వాములు జశ్వంత్ మాలి, ప్రకాష్ మాలి తెలిపారు.

24న చిత్ర కారుల రాష్ట్ర సమ్మేళనం

- 'శ్రమైక జీవనం'పై ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం జరుగుతుందని ఎంబి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ బాధ్యులు పి.మురళీకృష్ణ, ఎ.సునీల్‌కుమార్, ప్రముఖ చిత్రకారులు అరసవిల్లి గిరిధర్ తెలిపారు. నగరంలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం కళాకారుల రాష్ట్ర సమ్మేళనం, ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనంలో భాగంగా ఎంబి విజ్ఞాన కేంద్రంలో 'శ్రమైక జీవనం' చిత్ర ప్రదర్శన, 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుని పాత్ర' అనే అంశంపై సదస్సు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రముఖ చిత్రకారులు 48 మంది 'శ్రమైక జీవనం'పై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వ విద్యాలయం ఫైన్‌ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ మృత్యుంజయరావు, సాంప్రదాయ చిత్రకళ అధ్యాపకులు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారులు వై.శేషబ్రహ్మం, తెలుగు బాషోద్యమ సంస్థ నాయకులు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. ఈ చిత్రకారుల సమ్మేళనం, ఎగ్జిబిషన్లలో రాష్ట్రం నలుమూలల నుండి 200 మంది చిత్రకారులు పాల్గొంటారని తెలిపారు. మీడియా సమావేశంలో ఎంబివికె బాధ్యులు కె.స్వరూపరాణి, యు.వి.రామరాజు, టి.క్రాంతికిరణ్, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల రాష్ట్ర సమ్మేళనం, ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ, సునీల్‌కుమార్

మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున నాయకులు

చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్లూమ్స్ జెట్లూమ్స్‌లకు రాయితీలిస్తూ చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నాయని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అక్టోబర్ 6, 7 తేదీల్లో నిర్వహించనున్న సంఘం రాష్ట్ర మహాసభకు బుధవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి రద్దు చేసి, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను ఉల్లంఘించిన పవర్ లూమ్స్, జెట్లూమ్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేనేత వస్త్రాలను యూనిఫామ్‌గా వాడాలనే చట్టం ఉందని దానిని అమలుచేయాలని డిమాండ్ చేశారు. చేనేతలకు రూ.25 వేలు ఇస్తామనే సిఎం ప్రకటనపై విధివిధానాలు రూపొందించి జిఒ జారీ చేయాలని కోరారు.ఈ అన్ని అంశాలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కత్తితో దాడి .. నగదుతో పరారీ

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని నమ్మించి కత్తితో దాడి చేసి నగదుతో దుండగులు పరారైన ఘటన బాపట్ల జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని విజయవాడ చిట్టినగర్‌కు చెందిన షేక్ రెహమాన్ అబ్దుల్ అజీమ్‌కు బాపట్ల జిల్లా వేటపాలెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లి రాజేష్ నమ్మించాడు. రూ.నాలుగు లక్షల నగదుతో లక్ష్మీపురానికి అబ్దుల్ అజీమ్ వెళ్లాడు. బంగారం చూపించకుండా తన ఇంటిలోనే కూర్చోబెట్టి రాజేష్ కాలయాపన చేశాడు. విసుగు చెందిన బాధితుడు నగదుతో వెళ్లిపోవడానికి యత్నించగా, రాజేష్, మరో ఇద్దరు కలిసి అబ్దుల్ అజీమ్‌పై కత్తితో దాడి చేశారు. డబ్బులు, సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. గాయాలతో బాధపడుతున్న అజీమ్‌ను స్థానికులు వైద్యశాలకు తరలించారు. వేటపాలెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వంపై బురదజల్లుతున్న వైసిపి

- టిడిపి నేత శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వంపై వైసిపి నిత్యం బురదజల్లే ప్రయత్నం చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తప్పుడు ప్రచారాలతో మనుగడ సాగిస్తూ తమ ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నారని పేర్కొన్నారు. తీవ్ర వర్షాలతో అమరావతి మునిగిపోతోందని ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టారని విమర్శించారు. పదేళ్లకో, 20 ఏళ్లకో వరదలొస్తుంటాయని, దానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఖాళీ అవుతోందని, అనేక మంది టిడిపిలో చేరుతున్నారని తెలిపారు.

జగన్ రాజీనామా చేయాలి: బిటెక్ రవి

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మరలా ఎన్నికల్లో పాల్గొనాలని టిడిపి నేత బిటెక్ రవి సవాల్ విసిరారు. కేంద్ర బలగాలతో పులివెందుల జెడ్‌పిటిసి ఎన్నికలు మరలా నిర్వహించాలని కోరుతున్న జగన్ తన సవాల్‌ను స్వీకరించాలని తెలిపారు. తాము కూడా రాజీనామా చేస్తామని, జెడ్‌పిటిసి, ఎమ్మెల్యే ఎన్నికలను కేంద్రబలగాలతో ప్రజాస్వామ్యబద్ధంగా జరిపిద్దామన్నారు.ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగితే జగన్ పరిస్థితి తెలుస్తుందని, అందుకనే ఎన్నికల్లో పోటీ చేశామని చెప్పారు. వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు కాలపరిమితి విధించడం వల్లే సిబిఐ విచారణ ఆగిపోయిందని అన్నారు.

చిన్న పరిశ్రమలకు టారిఫ్‌ల దెబ్బ

- టెక్స్‌టైల్, డైమాండ్స్, కెమికల్స్‌పై అధిక ప్రభావం
- క్రిసిల్ ఇంటెలిజెన్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక సుంకాలు ఇక్కడి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ)పై తీవ్ర ప్రభావం చూపనుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా టెక్స్‌టైల్, డైమాండ్స్, రసాయనాలకు చెందిన ఎంఎస్‌ఎంఇలు ప్రభావితం కానున్నాయని హెచ్చరించింది. 'మొత్తం ఎగుమతుల్లో 45 శాతం వాటా కలిగిన ఎంఎస్‌ఎంఇలను ట్రంప్ టారిఫ్‌లు భారీగా దెబ్బతీయనున్నాయి. టెక్స్‌టైల్స్, డైమాండ్స్, కెమికల్స్‌లోని రంగాలు అత్యంత దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. ఆగస్టు 27 నుంచి మరో 25 శాతం టారిఫ్ విధించడం ద్వారా 50 శాతానికి చేరుతుంది. ఇది భారత్‌లోని పలు ఎగుమతి రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది." అని క్రిసిల్ ఇంటెలిజెన్స్ రిపోర్ట్ వెల్లడించింది. అమెరికాకు భారత దేశ ఎగుమతుల్లో 25 శాతం వాటాను టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు కలిగి ఉన్నాయి. ఎంఎస్‌ఎంఇల్లో 40 శాతం వాటా కలిగిన కెమికల్స్ రంగంలో ప్రతికూల ఇబ్బందులు నెలకొననున్నాయి. భారత్‌లోని ఈ రంగాలకు అమెరికా ప్రధాన వినియోగదారుగా ఉంది.

భారత సరుకులపై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లను వేయడంతో 48.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులపై ప్రతికూలత నెలకొందని కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఇటీవల పేర్కొన్నారు. 2024 వాణిజ్య విలువ ప్రకారం.. భారతదేశం నుంచి అమెరికాకు 48.2 బిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతయ్యాయన్నారు. ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఐదు రౌండ్ల చర్చలు జరగ్గా.. ఆరో రౌండ్ కోసం ఆగస్టు 25న అమెరికా బృందం రావాల్సి ఉన్నప్పటికీ వాయిదా పడింది.

రష్యా నుంచి పిఎస్‌యుల ఆయిల్ కొనుగోళ్ల కొనసాగింపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్, బిపిసిఎల్ కంపెనీలు భవిష్యత్‌లోనూ రష్యా నుంచి చమురును కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించాయి. రష్యన్ క్రూడ్ ఆయిల్ ధరలో తగ్గింపు పెరగడంతో సెప్టెంబర్, అక్టోబర్ డెలివరీల కోసం కొనుగోళ్లను తిరిగి ప్రారంభించినట్లు చమురు కంపెనీల వర్గాలు వెల్లడించాయి. రష్యాకు చెందిన ప్రముఖ ఉరల్స్ క్రూడ్‌పై డిస్కౌంట్ బ్యారెల్‌కు సుమారు మూడు డాలర్లను తగ్గింపును ప్రకటించింది. ఇది భారతీయ రిఫైనరీలకు ఆకర్షణీయంగా మారిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.. రష్యన్ ఆయిల్ కొనుగోళ్లపై వాషింగ్టన్ నుంచి విమర్శలు రావడం, జులైలో డిస్కౌంట్లు తగ్గడంతో ఈ రిఫైనరీలు కొనుగోళ్లను నిలిపివేశాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగస్టు 27 నుంచి భారతీయ వస్తువులపై అదనపు 25 శాతం సుంకం విధిస్తామని బెదిరించిన విషయం తెలిసిందే. మాకు రష్యన్ క్రూడ్‌ను కొనమని లేదా కొనవద్దని ఎవరూ చెప్పలేదని ఐఒసి ఛైర్మన్ అరవిందర్ సింగ్ సహ్నీ తెలిపారు. తాము ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఓరాకిల్‌లో 2800 మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ఐటి కంపెనీ ఓరాకిల్ తమ సంస్థలో పని చేస్తోన్న 2800 మంది ఉద్యోగులపై వేటు వేస్తోంది. భారత్‌లోని తన 28,824 మంది ఉద్యోగుల్లో సుమారు 10 శాతం మందికి సమానమయ్యే 2800 మందిని ఇంటికి పంపించాలని భావించింది. ఎఐ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడుల కోసం పునర్నిర్మాణ వ్యూహంలో భాగంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్, ముంబయి, పూణె, నోయిడా, కోల్‌కతాలోని సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ సేవలు, కస్టమర్ సపోర్ట్ బృందాల్లో కోతలు ఉండనున్నాయి. కాగా ఈ ఉద్వాసనలు ఆకస్మికంగా, సెవరెన్స్ ప్యాకేజీలు లేకుండా జరిగాయని ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌బిఐ లైఫ్ నుంచి స్మార్ట్ షీల్డ్ ప్లస్ ప్లాన్

హైదరాబాద్ : ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా 'స్మార్ట్ షీల్డ్ ప్లస్' పథకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపింది. దీన్ని మారుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించామని పేర్కొంది. ఇది వ్యక్తిగత, నాన్ లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, ప్యూర్ రిస్క్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ అని పేర్కొంది. ఇందులో మూడు రకాల కవరేజీ అప్షన్స్ ఉంటాయని తెలిపింది. డెత్ బెనిఫిట్ లంప్‌సమ్, వాయిదాలు లేదా రెండింటి కలయికగా చెల్లించబడుతుందని పేర్కొంది. బీమాదారుకు అనుకోనిది ఏదైనా జరిగితే అదనంగా నామినికి 60 ఏళ్ల వరకు రూ.25 లక్షలు లేదా 50 శాతం సమ్ అష్యూర్డ్ లభించనుందని ఎస్‌బిఐ లైఫ్ హెడ్ ఎం ఆనంద్ తెలిపారు. ఈ ప్లాన్‌తో బీమాదారు కుటుంబ సభ్యులు నిశ్చింతగా జీవించేలా, రేపటి కోసం సన్నద్ధమవ్వడానికి ఈ ప్లాన్ సహాయపడుతుందన్నారు.

రెడ్మీ 15 5జి మొబైల్ విడుదల

న్యూఢిల్లీ : షావోమి ఇండియాకు చెందిన రెడ్మీ కొత్తగా రెడ్మీ 15జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తమ సంస్థ గ్లోబల్‌గా 15 ఏళ్లు, భారత్‌లో 11 ఏళ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త మోడల్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. 7000 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన ఈ బడ్జెట్ ఫోన్ ధర రూ.15,000 లోపు ఉంటుందని తెలిపింది. 50 ఎంపి ఎఐ డ్యూయల్ కెమెరా, 8 ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని ప్రవేశపెట్టింది. ఇది ఫ్రాస్టెడ్ వైట్, మిడ్‌నైట్ బ్లాక్, శాండీ పర్పుల్ రంగులలో రూ.14,999 ధరతో ఆగస్టు 28 నుండి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభించనుందని తెలిపింది.

ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 80 శాతం బోనస్

బెంగలూరు : ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ తమ ఉద్యోగులకు భారీ బోనస్‌ను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఉద్యోగుల పనితీరు ఆధారంగా బోనస్ లెటర్లను జారీ చేసినట్లు పేర్కొంది. తొలి త్రైమాసికానికి సంబంధించి ఉద్యోగులకు సగటున 80 శాతం బోనస్‌ను ప్రకటించింది. గత త్రైమాసికంలో ఇచ్చిన 65 శాతం సగటు బోనస్ చెల్లింపుతో పోలిస్తే ఇది ఎక్కువ. ఈ బోనస్‌ను ఆగస్టు నెల జీతంతో కలిపి ఇవ్వనుంది. వివిధ స్థాయిల్లోని 3.23 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

సంపాదకీయం

భావజాల పోరు

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా ఫోరమ్ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికలో పోటీ తప్పదని తేలిపోయింది. అధికార ఎన్‌డిఎ కూటమి మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన సిపి రాధాకృష్ణన్‌ను ఇప్పటికే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించి, ఏకగ్రీవం కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రతిపక్షాల ఎంపికకు ప్రాధాన్యత ఏర్పడింది. తొలుత ఒకటి, రెండు పేర్లు పరిశీలించినట్లు వార్తలు వచ్చినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో సహా ఇండియా ఫోరమ్‌లోని పార్టీలన్నీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వైపు ఏకగ్రీవంగా నిలిచాయి. విలేకరుల సమావేశంలో 'ఆమ్ ఆద్మీ పార్టీతో సహా మేమంతా ఐక్యంగా బలపరుస్తున్నాం' అని తృణమూల్ నేత ప్రకటించడం విశేషం. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఈ ప్రతిపాదనను తెలియచేయగా ఎన్నికల బరిలో నిలవడానికి ఎంతో వినమ్రతతో ఆయన అంగీకరించారు. తన అభ్యర్థిత్వానికి సంబంధించిన ప్రకటన వెలువడిన తరువాత 'ఆ స్థానం నుండి ప్రజాస్వామ్యాన్ని మరింతగా పరిపుష్టం చేయడం సాధ్యమవుతుందని భావించే కొందరిలో నేనొకడిని. అందుకే పోటీకి అంగీకరించా. ఇది కేవలం నెంబర్ గేమ్ కాదు. అంతకు మించిన రాజ్యాంగ విధి' అని ఆయన అన్నారు. 'నా జీవితమంతా నిష్పక్షపాతంగా ఉండటానికే ప్రయత్నించా, ఆ పదవికి ఎన్నికైతే రాజ్యసభ ఛైర్మన్‌గా ఆ స్థానం నుండి అంతే నిష్పక్షపాతంగా వ్యవహరిస్తా' అని కూడా సుదర్శన్‌రెడ్డి చెప్పారు. అన్ని వ్యవస్థలు అధికారపార్టీ తానులో ముక్కలుగా మారి, నిస్సిగ్గుగా ప్రవర్తిస్తున్న వేళ ఈ తరహా వ్యాఖ్యలు సాధారణ ప్రజానీకానికి కొంత ఊరటనిస్తాయి. ప్రజాస్వామ్య ప్రియులకు కొండంత బలాన్ని ఇస్తాయి.

అధికార ఎన్‌డిఎ కూటమికి ఉన్న సంఖ్యాపరమైన ఆధిక్యతను ఎవ్వరూ ప్రశ్నించలేరు. కానీ, సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంతో ఒక పోలిక, ఒక చర్చ జరగడం ఖాయం! మోడీ నాయకత్వంలో అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయి. ఎవరి రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరపాల్సి వస్తోందో ఆ జగదీప్ ధన్‌ఖడ్ స్వయంగా అధికారపక్షం అండతో ప్రతిపక్షాల హక్కులపై దాడి చేయడం, వారి నోరు నొక్కడానికి అన్ని విధాలా ప్రయత్నించడం దేశ ప్రజలు చూశారు. బిజెపి అగ్రనాయకత్వంతో చెడటంతో అనూహ్యంగా ఆయన తప్పుకోవాల్సి వచ్చింది కానీ, లేని పక్షంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధ్యక్ష స్థానం నుండి ఆయన హూంకరింపులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉండేవి! మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ నిర్వాకం ప్రజల కళ్ల ముందే ఉంది. సిబిఐ, ఇడి, ఐటి వంటి దర్యాప్తు సంస్థల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. న్యాయ వ్యవస్థ పనితీరునే సందేహాస్పదంగా చేసిన ఘనత మోడీ సర్కారుది! ఇప్పుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ ఎంపిక కూడా అటువంటిదే. దీనితో కీలకమైన రాజ్యాంగ పదవులు, వ్యవస్థల పట్ల మోడీ సర్కారు వైఖరేమిటో స్పష్టమవుతోంది. అందుకే, ఈ ఎన్నిక సంఖ్యా బలంతో సంబంధం లేకుండా ఒక భావజాల పోరుగా ప్రాధాన్యత సంతరించుకోనుంది.

తెలుగు నేల నుండి అత్యున్నత స్థాయికెదిగి, రాజ్యాంగ-న్యాయ కోవిదుడుగా, నిష్పక్షపాతిగా ఖ్యాతిపొందిన సుదర్శన్‌రెడ్డి వైపు నిలవడం, ఆయన గెలుపుకోసం కృషి చేయడం తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల కనీస బాధ్యత! సమైక్య రాష్ట్ర విభజన తరువాత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై గళం విప్పడానికి, నిరసన తెలియచేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలకు దక్కిన మహదవకాశం! కానీ, ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములుగా ఉన్న టిడిపి, జనసేనతో పాటు ప్రతిపక్ష వైసిపి కూడా ఆ అవకాశాన్ని కాలదన్నుతున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాల పుణ్యమా అని రాష్ట్రంలోనూ మతోన్మాద ప్రమాదం విస్తరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అదాని ప్రదేశ్‌గా మారుతోంది. ఎంత ప్రతిఘటిస్తున్నా విశాఖ ఉక్కును తెగనమ్మడానికే కేంద్రం సిద్ధమౌతోంది. అయినా, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిని బలపర్చి, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల కొమ్ముకాయాలని టిడిపి, జనసేనలతో పాటు ప్రతిపక్ష వైసిపి కూడా నిర్ణయించడం రాష్ట్రానికి ఆత్మహత్య సదృశ్యమే! ఆ పార్టీలు ఇప్పటికైనా పునరాలోచించాలి. రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజల ఐక్యతకు పెద్దపీట వేసేలా నిర్ణయం తీసుకోవాలి.

సందర్భం

సామాజిక రుగ్మతలన్నిటికీ మూల కారణం...అనేక మందిపై ఆధిపత్యం వహించాలనే కోర్కె.. ఇతరుల శ్రమను దోచుకుని సుఖాలు అనుభవించాలనే కోర్కె.. ఒక తెగకు లేక ఒక గణానికి నాయకునిగా వున్న వ్యక్తి ఆ సామూహిక బలం వల్ల తనకు వచ్చిన శక్తిని...తన వ్యక్తిగత బలంగా భ్రమించి తనను తాను అతిగా ఊహించుకునే తత్వం.

- మగ్జిమ్ గోర్కీ

ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.

ఉక్కుపై కూటమి పార్టీలవి తుక్కు వాగ్దానాలేనా?

అమరవీరుల త్యాగాలకు విలువ లేదా?

> పది రోజుల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో వచ్చిన ప్రశ్నకు రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టీల్ సహాయ మంత్రి, బిజెపి నేత భూపతిరాజు శ్రీనివాసరాజు సమాధానమిస్తూ వ్యూహాత్మక అమ్మకాలు చేస్తామని చెప్పారు. ఆంధ్ర ప్రజల ప్రయోజనాల కన్నా కార్పొరేట్ ప్రయోజనాలే మాకు మిన్న అన్న పద్ధతిలో ఆయన వ్యవహరించారు. కేంద్ర ఉక్కు మంత్రిని మన రాష్ట్ర ఎంపీలు కలిసిన 15 రోజుల్లోనే ఇలాంటి పరిణామాలు జరుగుతుండడం పట్ల రాష్ట్ర ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటు పడడంలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగులు, నిర్వాసితులకు ఉపాధి పెంచే పద్ధతులను పెంపొందించాలి. యుద్ధ ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి.

కె. లోకనాథం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇ.ఒ.ఐ) పేరుతో 12 విభాగాల్లో 32 ఇ.ఒ.ఐ లను ప్రకటించింది. తద్వారా ఉక్కు ప్రైవేటీకరణను వేగవంతం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పడినది. దీన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు రోజురోజుకూ కుట్రలను తీవ్రతరం చేస్తోంది. ఇలా వ్యవహరించడం అమరవీరుల త్యాగాన్ని వృథా చేయడమే అవుతుంది. భూములు ఇచ్చిన నిర్వాసితుల జీవితాలతో ఆడుకోవడమే అవుతుంది. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వానికి కీలక భాగస్వామిగా ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించే విషయంలో ఎందుకు ఒత్తిడి చేయడంలేదు? స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన 11,440 కోట్ల ప్యాకేజీ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించేదానికన్నా మరింత బలహీనపర్చే చర్య అని స్పష్టమౌతోంది. కొత్తగా 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఉత్పత్తిలోకి తీసుకొచ్చి మొత్తం 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు, ఎస్.ఎం.ఎస్ 1, 2, 3, డబ్ల్యు.ఆర్.ఎం (వైర్ అండ్ రాడ్ మిల్లు), సెంట్రల్ మిషన్ షాప్, ఎస్.టి.ఎం లు, విద్యుత్ ప్లాంట్‌ను విడివిడిగా అమ్మకానికి పెట్టారు. ప్యాకేజీతో అప్పులన్నీ తీర్చి ప్రైవేట్ వారికి అప్పజెప్పే ప్రయత్నమే ఇదంతా అని ఇట్టే అర్థమవుతుంది. స్టీల్‌ప్లాంట్ మొత్తాన్ని ఒకేసారి అమ్మితే వ్యతిరేకత వస్తుందనే పేరుతో ముక్కముక్కలు చేసి అమ్మాలని చూస్తున్నారు.

కేంద్ర బిజెపి పాలకులు దేశభక్తి గురించి నిరంతరం వల్లిస్తుంటారు. ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నట్లుగా ప్రకటిస్తుంటారు. ఆచరణ అందుకు భిన్నం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తగిన ప్రణాళికతో పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపినప్పుడు లాభాల బాటలో వుంది. మోడీ అధికారం చేపట్టాక దీనిపై కుట్రలు మొదలయ్యాయి. లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు ఎందుకు అడుగులు వేసినట్టు?

పదకొండడు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను మోడీ సర్కారు వేగవంతం చేసింది. ఆ సంస్థలను నిర్వీర్యం చేయడం, ఉపాధిని దెబ్బకొట్టడం, సామాజిక న్యాయాన్ని తుంగలోకి తొక్కడమే ఉద్దేశంగా ముందుకు సాగింది. కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలు అన్ని రంగాల్లో విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు ఇస్తున్నది. దీంతో ప్రపంచ కుబేరుల్లో వీరి స్థానం కూడా పదిలమైంది. దీనిని బట్టి భారత పాలకవర్గం ఎవరి పక్షాన వుండి సంస్కరణలు వేగవంతం చేస్తున్నదో అర్థమౌతుంది.

సంస్కరణలను వేగవంతం చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత సన్నద్ధం చేస్తున్నారు ప్రధానమంత్రి. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కీలకమైన ఉత్పత్తి విభాగాలను దశల వారీగా ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రలు పన్నుతున్నారు. కేంద్ర ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షణ చేస్తున్నది. ఇటీవల కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమి ఎంపీలు ఉక్కు మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిసి ఆర్సెలార్ మిట్టల్‌కు రాయితీలు ఇవ్వాలని, ఎన్.ఎం.డి.సి ద్వారా సొంత గనులు కేటాయించాలని విన్నవించుకున్నారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖామాత్యులు కె.రామ్మోహన్ నాయుడు, తెలుగుదేశం లోక్‌సభాపక్ష నాయకులు లావు కృష్ణదేవరాయులు, సానా సతీష్‌బాబు, దగ్గుమళ్ల ప్రసాద్, పార్థసారథి, కేశినేని శివనాథ్ (చిన్ని) సహా విశాఖపట్నం ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీభరత్ కూడా వున్నారు.

వీరు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం కనీసం మాట్లాడలేదు. భూములు త్యాగం చేసిన నిర్వాసితుల కుటుంబాలకు చెందిన ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏ కారణమూ లేకుండా ఇటీవల కాలంలో అన్యాయంగా తొలగించింది. వీరంతా ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మళ్లీ వి.ఆర్.ఎస్ పేరుతో పర్మినెంట్ కార్మికులను తొలగిస్తామని హెచ్చరికలు చేస్తోంది. ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికుల పట్ల ఉక్కు యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. దీనిని ప్రతిఘటిస్తున్న కార్మిక నాయకులను అక్రమ బదిలీలు చేస్తోంది. సకాలంలో జీతాలు, ప్రోత్సాహకాలు ఇవ్వకపోయినా కార్మికులు గణనీయమైన ఉత్పత్తిని అందిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అగ్రభాగాన నిలుపుతున్నారు. ఇలాంటి అంశాలను ఉక్కు శాఖా మంత్రి దృష్టికి సదరు టిడిపి ఎంపీలు తీసుకెళ్లలేదు. కానీ అనకాపల్లి జిల్లాలో ప్రతిపాదిత ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని రాయితీలనూ అందించాలని నిస్సిగ్గుగా కేంద్ర ప్రభుత్వాన్ని అడగడం ఉత్తరాంధ్రకు, యావత్తు రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినట్లే. నక్కపల్లిలో భూములు కోల్పోయిన రైతులు, భూములపై ఆధారపడిన కూలీలు, మత్స్యకారుల గురించిగానీ....ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కారణంగా నిర్వాసితులు అవుతున్న మత్స్యకారులు, ప్రజల గురించిగానీ కనీసం ప్రస్తావించలేదు. ఈ ప్రాంతంలో గత 11 సంవత్సరాల నుండి అక్రమ భూసేకరణ చేస్తున్నారని స్థానిక ప్రజలు పోరాటాలు చేస్తున్నా వాటిని లెక్కలోకి తీసుకోవడంగానీ, మద్దతు తెలపడంగానీ చేయలేదు. నేడు ఆ భూముల్లో ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ సేవలో మన ప్రజాప్రతినిధులు మునిగి తేలుతున్నారంటేనే మనకి అర్థం కావాలి. విశాఖ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఎంపీ శ్రీభరత్ స్టీల్‌ప్లాంట్ కోసం కాకుండా ఆర్సెలార్ మిట్టల్ గురించి మాట్లాడడం అంటే ఆయన సేవలు ఎవరి కోసమనేది అర్థం చేసుకోవాలి. ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేసిన పల్లా శ్రీనివాసరావుని గాజువాక ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. కానీ నేడు ఒక్కొక్క విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుంటే ఎందుకు మాట్లాడడంలేదు? అప్పుడు చేసిందంతా కేవలం ఎన్నికల్లో గెలవడం కోసమేనా? రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, అవసరమైతే కేంద్రం మెడలు వంచి అయినా స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని సెలవిచ్చారు. నేడు కేంద్రం స్టీల్‌ప్లాంట్ విభాగాలను ప్రైవేటీకరిస్తుంటే ఎందుకు నివారించడంలేదు? స్టీల్‌ప్లాంట్ కోసం రూ.11440 కోట్ల ప్యాకేజీ కేటాయిస్తే పాలాభిషేకాలు చేసిన బిజెపి, తెలుగుదేశం నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడడంలేదు?

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదేళ్లుగా కార్మికులు, ప్రజలు విశాఖపట్నం నుండి ఢిల్లీ వరకు పెద్దఎత్తున ఉద్యమం నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమానికి బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో నేడున్న పాలక పార్టీల ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. ముఖ్యంగా నేడు కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న కె.రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ త్యాగాలతో ఏర్పడిందని, ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీక అని, ఎంతో మంది భూ నిర్వాసితుల త్యాగ ఫలితంగా ఏర్పడిందని కితాబిచ్చారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఏ తెలుగు ప్రజలూ ఊరుకోరు. రాష్ట్రం మీద ఆధారపడి కేంద్రం ఉంది. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు కేంద్రం చేతిలో వున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను అడ్డగోలుగా అమ్మితే సహించం. అమ్మేవారు ఎవరు? కొనేవారు ఎవరు? అని ప్రధాన పార్టీల నుంచి ఏ ఒక్క ప్రజాప్రతినిధీ అనడం లేదు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడానికే నేను ప్రజాప్రతినిధిగా ఉన్నానని, ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతిస్తున్నానని నాడు తెలియజేసి నేడు కేంద్ర కేబినెట్ మంత్రిగా వుండి కూడా ఈ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేలా ఒత్తిడి చేయడంలేదు. పైగా కేంద్ర బిజెపి ప్రభుత్వ సంస్కరణ విధానాలకు మద్దతు తెలపడమంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసగించడమే. పది రోజుల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో వచ్చిన ప్రశ్నకు రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టీల్ సహాయ మంత్రి, బిజెపి నేత భూపతిరాజు శ్రీనివాసరాజు సమాధానమిస్తూ వ్యూహాత్మక అమ్మకాలు చేస్తామని చెప్పారు. ఆంధ్ర ప్రజల ప్రయోజనాల కన్నా కార్పొరేట్ ప్రయోజనాలే మాకు మిన్న అన్న పద్ధతిలో ఆయన వ్యవహరించారు. కేంద్ర ఉక్కు మంత్రిని మన రాష్ట్ర ఎంపీలు కలిసిన 15 రోజుల్లోనే ఇలాంటి పరిణామాలు జరుగుతుండడం పట్ల రాష్ట్ర ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడడంలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిరుద్యోగులు, నిర్వాసితులకు ఉపాధి పెంచే పద్ధతులను పెంపొందించాలి. యుద్ధ ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ పేరుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం అఖిలపక్ష రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.

/ వ్యాసకర్త సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు /

అమెరికా అడ్డగోలు సుంకాలు - ఆక్వా రైతు కుదేలు

బి. బలరాం

> ప్రభుత్వాలకు ఆదాయం యావ తప్ప రైతులకు, ఈ రంగానికి అవసరమైన ఆదుకునే చర్యలు లేవు. దేశంలో, రాష్ట్రంలో వినియోగాన్ని (దేశీయ వినియోగం కేవలం 10 శాతం మాత్రమే ఉంది) ప్రోత్సహించడం లేదు. చౌకైన, పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించాలనే ఆలోచన, శ్రద్ధ లేదు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో అమెరికా 31 శాతం, చైనా 20 శాతం, వియత్నాం 12 శాతం మొత్తం 63 శాతం దేశీయంగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర జిడిపిలో ముఖ్య భాగంగా ఉన్న (రాష్ట్ర జిడిపి 9 శాతం) ఆక్వా రంగం పట్ల శ్రద్ధ వహించాలి. నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ ఆ రంగానికి, రైతాంగానికి తగులుతున్న దెబ్బలను ప్రభుత్వాలు కాయడం లేదు. బాధాకరం అంటూ ప్రధాని, నష్టం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి మాటలు తప్ప ఆదుకునేందుకు చర్యలు లేవు. ఉప ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుని నుండి కనీస స్పందనే లేదు.

ట్రంప్ నేతృత్వంలోని అమెరికన్ ప్రభుత్వం భారతదేశ విదేశీ ఎగుమతులపై ఆగస్టు 7 నుండి 25 శాతం, ఆగస్టు 25 నుండి మరో 25 శాతం పన్నులు విధించడం ఘోరమైన విషయం. పైకి 50 శాతంగా కనబడుతున్నా ఇది ఆచరణలో కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ 5.76 శాతం, యాంటీ డంపింగ్ డ్యూటీ 3.96 శాతం కలిసి 59.72 శాతం కానుంది. భారత్ నుండి అమెరికాకు ప్రధానంగా రత్నాలు (రూ.లక్ష కోట్లు), విద్యుత్ పరికరాలు, మిషనరీ (రూ.80 వేల కోట్లు), వస్త్రాలు (రూ.90 వేల కోట్లు), రసాయనాలు (రూ.20 వేల కోట్లు), తోలు (రూ.10 వేల కోట్లు), రొయ్యలు (రూ.20 వేల కోట్లు) ఎగుమతి అవుతున్నాయి. అమెరికాకు వివిధ రకాల ఎగుమతులు (రూ.7,50,000 కోట్లకు పైగా విలువ చేసే) అవుతుండగా అమెరికా నుండి భారత్‌కు రూ.3,95,000 కోట్ల విలువ చేసే దిగుమతులు జరుగుతున్నాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్యం విలువ రూ.11,50,000 కోట్ల వరకు ఉంది. దాంతో ఈ సుంకాల భారం మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. భారత్ అత్యంత మిత్ర దేశంగా చెబుతున్న అమెరికా, ట్రంప్ మంచి మిత్రుడని చెబుతున్న మన ప్రధాని ఇరువురూ ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకుంటూ, జబ్బలు చరుచుకుంటున్నారు. ఈ పన్నుల భారం రాష్ట్రంలోని ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. సముద్ర ఉత్పత్తిలోను, రైతులు పెంచే చెరువుల్లోను రొయ్యలు ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. భారత్ నుండి 67 దేశాలకు ప్రధానంగా అమెరికాకు రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. దేశ ఉత్పత్తిలో (9 లక్షల టన్నులు) 70 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతోంది. దేశ ఎగుమతుల్లో 60 శాతం ఆంధ్రా నుండే. ఇందులో 28 నుండి 30 శాతం అమెరికాకు వెళుతోంది. మన రాష్ట్రంలో జరుగుతున్న రూ.25,000 నుండి రూ.30,000 కోట్ల విలువైన రొయ్యల ఉత్పత్తిలో సింహ భాగం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండే. ఉమ్మడి తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలతోపాటు ఇటీవల కాలంలో రాయలసీమ జిల్లాల్లో కూడా ఉత్పత్తి జరుగుతోంది. ఆంధ్రతోపాటు తమిళనాడు, ఒరిస్సా, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ ఉత్పత్తి ఉంది. దేశంలో 10 లక్షలకు పైగా ఆక్వా (రొయ్య, చేప) రైతులు వుండగా రాష్ట్రంలో 2.50 లక్షల రొయ్యల రైతులుంటారని అంచనా. మొత్తం ఆక్వా రంగంపై 30-40 లక్షల మంది ప్రత్యక్ష (ప్రాసెసింగ్, ఐస్‌ప్లాంట్లు, రవాణా, హార్వెస్టింగ్) పరోక్ష ఉపాధి పొందుతున్నారని అంచనా. అయితే మన రాష్ట్రంలో జరిగే మొత్తం ఉత్పత్తిలో అమెరికాకు వెళ్ళేది 28-30 శాతం మాత్రమే.

ప్రభుత్వాల స్పందన నిరాశాజనకం

అమెరికా పన్నుల నేపథ్యంలో దేశ ఆక్వా రంగానికి అందునా ఆంధ్రప్రదేశ్, గోదావరి జిల్లాలకు తీవ్ర నష్టం, కుదుపు ఉంటుంది. ఆక్వా రైతాంగం తీవ్ర ఆందోళన, ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారు. అయితే మొత్తం ఉత్పత్తిలో 70 శాతం పైగా ఇతర దేశాలకు ఎగుమతి ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల్లో భాగస్వామిగా ఉన్న మన మీద ఏకపక్షంగా ఇంత శాతం పన్నులు చట్ట రీత్యా వేయరాదు. అతి పెద్ద దేశమైన చైనా మాదిరిగా ఎదిరించే శక్తి, పన్నులకు ప్రతిగా పన్నులు వేసే ధైర్యం మన ప్రభుత్వానికి లేదు. అమెరికాను ఎదిరించడంలో కనీసం సింగపూర్ లాంటి చిన్న దేశ ప్రధానికి వున్న పాటి తెగువ 52 అంగుళాల ఛాతీ అని గొప్పలు చెప్పుకుంటున్న మన ప్రధానికి లేకపోవడం అవమానకరమే. ఇలాంటి పరిస్థితుల్లో ఇతర దేశాలకు ఎగుమతులపై శ్రద్ధ, ప్రత్యామ్నాయ మార్గాలు వెదకాలి. వ్యవసాయ, ఆక్వా రంగ రైతాంగాన్ని ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. అది కనిపించడం లేదు. సుంకాలు విధించడం విచారకరం. దురదృష్టకరం లాంటి మాటలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

పైగా అమెరికాకు ఎగుమతి అయ్యేది 20, 30 కౌంట్లే కాని ఎగుమతి కంపెనీలు ఇతర దేశాలకు ఎగుమతి చేసే అన్ని కౌంట్ల ధరలు తగ్గించి వేస్తున్నారు. సందట్లో సడేమియాలా ఎగుమతి కంపెనీలు అమెరికా పన్నుల సాకు చూపి మొత్తం ధర దిగ్గోసి కొంటున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నవాటికి, అమెరికా పన్నులకు సంబంధమే లేదు. అయినా కౌంటుకు రూ.40 నుండి రూ.50 తగ్గించి (పన్నులు అమలులోకి రాక ముందు నుండే) కొని రైతులను దోచుకుంటున్నారు. ఎగుమతి కంపెనీల ఇష్టారాజ్యంగా ఉంది. కష్టాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటూ పండిస్తున్న రైతులకు బోడిగుండుపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది.

సీడ్, ఫీడ్, కరెంటు రాయితీలు పట్టించుకోరే!

ఒకవైపున అత్యధికభాగం న్యాయమైన సీడ్ దొరకడం లేదు. ప్రభుత్వం సీడ్ బాధ్యత ఏమాత్రం తీసుకోవడం లేదు. ఉన్న ఒక్కగానొక్క ప్రభుత్వ సీడ్ హేచరీ (టాస్ పార్క్) మూతపడింది. లెక్కలేనన్ని ప్రయివేటు సీడ్ హేచరీలు పుట్టుకొచ్చాయి. ఫీడ్ ధర నియంత్రణ లేదు. పలు ఫీడ్ల నాణ్యతపై కూడా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముడి సరుకు సోయాబీన్ ధర పెంచినప్పుడు కంపెనీలు ఫీడ్ ధర పెంచేస్తున్నాయి. తగ్గినప్పుడు మాత్రం తగ్గించడం లేదు (క్రూడ్ ఆయిల్-పెట్రోలు, డీజిల్ ధరల తంతు.).

ఇటీవల రైతులు గగ్గోలు పెట్టి తీవ్ర ఆందోళన చేయగా కంటి తుడుపుగా కేజీకి రూ.4 మాత్రం తగ్గించారు. కనీసం రూ.15-రూ.20 తగ్గించాలి. విద్యుత్ రాయితీ (యూనిట్‌కి రూ.1.50) చాలా ప్రాంతాల్లో, రైతులకు అందడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమైనవి, కొత్తవి ఇవ్వడం లేదు. ఆక్వా ద్వారా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వం పన్నులు, మార్కెట్ సెస్‌ల రూపంలో రూ.వందల కోట్ల ఆదాయాన్ని పొందడం తప్ప రైతులను పట్టించుకున్నది, వారి గోడు విని సమస్యలు పరిష్కరించిందీ లేదు. ప్రభుత్వాలకు ఆదాయం యావ తప్ప రైతులకు, ఈ రంగానికి అవసరమైన ఆదుకునే చర్యలు లేవు. దేశంలో, రాష్ట్రంలో వినియోగాన్ని (దేశీయ వినియోగం కేవలం 10 శాతం మాత్రమే ఉంది) ప్రోత్సహించడం లేదు. చౌకైన, పౌష్టికాహారాన్ని ప్రజలకందించాలనే ఆలోచన, శ్రద్ధ లేదు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో అమెరికా 31 శాతం, చైనా 20 శాతం, వియత్నాం 12 శాతం మొత్తం 63 శాతం దేశీయంగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర జిడిపిలో ముఖ్య భాగంగా ఉన్న (రాష్ట్ర జిడిపి 9 శాతం) ఆక్వా రంగం పట్ల శ్రద్ధ వహించాలి. నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ ఆ రంగానికి, రైతాంగానికి తగులుతున్న దెబ్బలను ప్రభుత్వాలు కాయడం లేదు. బాధాకరం అంటూ ప్రధాని, నష్టం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి మాటలు తప్ప ఆదుకునేందుకు చర్యలు లేవు. ఉప ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుని నుండి కనీస స్పందనే లేదు.

తక్షణం తీసుకోవాల్సిన చర్యలు

- కేంద్ర ప్రభుత్వం ఎంపెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి మొత్తం ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలి. కేంద్రం, ప్రధాని అమెరికాతో చర్చలు జరపాలి. ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టాలి. తక్కువ సుంకాలున్న అవసరమైన దేశాలకు ఎగుమతులు ప్రోత్సహించాలి.
- కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలు తిప్పికొట్టాలి.
- అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- ఆక్వా రంగాన్ని వ్యవసాయంగా గుర్తించాలి. రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమస్యలపై చర్చించాలి.
- రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోవలె కౌంటుల వారీగా ధరలు నిర్ణయించి ఎక్స్‌పోర్టర్లు, ట్రేడర్లతో అమలు చేయించాలి. తగిన యంత్రాంగం ఏర్పాటు చేయాలి. మార్కెట్ జోక్యం పథకం (ఎం.ఐ.ఎస్) ద్వారా సబ్సిడీ ధర ఇవ్వాలి. ఇన్సూరెన్సు వర్తింపచేయాలి.
- నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేలా చూడాలి. ధరలు నియంత్రించాలి. విద్యుత్ రాయితీ, పెండింగ్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి.
- దేశంలో వినియోగం పెరిగేలా (డొమెస్టిక్) చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో తక్కువ ధరకు లభించే ఈ పౌష్టికాహారం విద్యార్థులకు భోజన పథకంలో అందించాలి. సబ్సిడీ రేట్లకు ప్రజలకు అందించాలి. సైన్యానికి వినియోగించాలి.
- మార్కెట్ యార్డుల్లో, సొసైటీల్లో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలి.
- కేంద్రం ఎక్స్‌లెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి. సమస్యలు పరిష్కరించాలి.

సమస్యల పరిష్కారానికి ఆక్వా రైతాంగం ఇతర పంటల రైతుల సహకారంతో ఐక్యంగా, రాజకీయాలకు అతీతంగా కదలాలి. ఉద్యమించాలి. కష్టపడి పండించి నష్టపోవడం కాదు. పోరాడి సాధించుకోవాలి. దేశంలో సాగుతున్న రైతాంగ ఉద్యమాలతో మమేకం కావాలి. పాలకుల కళ్ళు తెరిపించాలి.

/ వ్యాసకర్త సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బహిర్భూమికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన దెందులూరు మండలంలోని కొవ్వలి ప్రాంతంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం కొవ్వలి ప్రాంతానికి చెందిన కానూరు అభిషేక్ (18) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి చెరువుగట్టుకు బహిర్భూమికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. అభిషేక్ ఒకసారిగా చెరువులో పడిపోయాడు. స్నేహితుడు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దెందులూరు ఎస్‌ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బుధవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలు

ఇది పదవి కోసం పోటీ కాదు

- ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి పరిచయ కార్యక్రమంలో మల్లికార్జున్ ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నిక కేవలం పదవి కోసం పోటీ కాదని, ఇది మన దేశ ఆత్మ కోసం ఒక సైద్ధాంతిక యుద్ధమని కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బుధవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియా బ్లాక్ నేతలు, ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్‌సిపి నేత శరద్ పవర్, శివసేన నేత సంజయ్ రౌత్, డిఎంకె నేత తిరుచ్చి శివ, ఎస్‌పి నేత రాంగోపాల్ యాదవ్, సిపిఎం నేత జాన్ బ్రిట్టాస్‌తో పాటు అన్ని ఇండియా బ్లాక్ పార్టీల నేతలు, ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి పదవికి తమ ఉమ్మడి అభ్యర్థిగా బి. సుదర్శన్ రెడ్డిని ప్రతిపక్ష పార్టీలు ప్రతిపాదించడం చాలా గర్వంగా, నమ్మకంగా ఉందని అన్నారు. ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి నిర్భయమైన విజేత అని, మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన మైలురాయి తీర్పులను అందించారని అన్నారు. ఈ ఉపరాష్ట్రపతి ఎన్నిక కేవలం పదవి కోసం పోటీ కాదని, ఇది మన దేశం ఆత్మ కోసం ఒక సైద్ధాంతిక యుద్ధమని పేర్కొన్నారు. పాలక పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని ఎంచుకున్నప్పటికీ, తాము రాజ్యాంగాన్ని, దాని విలువలను తమ మార్గదర్శక కాంతిగా సమర్థిస్తామని అన్నారు. దేశ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ విశ్వసనీయత పార్లమెంటు బలమైన వేదికగా పనిచేయడంపై ఆధారపడి ఉంటుందని, ఇక్కడ సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల మనోవేదనలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా, న్యాయంగా వ్యక్తీకరిస్తారని అన్నారు. వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాల భాగస్వామ్యం లేకుండా మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా, తొందరపాటుతో బిల్లులను ఎలా ఆమోదించిందో దేశం మొత్తం చూసిందని అన్నారు. ఇందులో చైర్మన్ పాత్ర కూడా చాలా ముఖ్యమైనదని అన్నారు. ప్రతిపక్ష ఎంపిలను మాట్లాడనివ్వకపోవడం, కారణం లేకుండా వారిని సస్పెండ్ చేయడం, పార్లమెంటుకు ఒక చీకటి అధ్యాయంగా నిరూపితమైందన్నారు. అనేక ముఖ్యమైన బిల్లులు సజావుగా, సరైన చర్చ లేకుండా ఆమోదిస్తున్నారని, పాలక పార్టీ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే సాధనంగా పార్లమెంటును ఉపయోగిస్తున్నారని విమర్శించారు.

ఇటువంటి సమయంలో దేశానికి ఉపరాష్ట్రపతిగా బి. సుదర్శన్ రెడ్డి వంటి ఆదర్శప్రాయమైన నిష్పాక్షిక న్యాయం అవసరమని అన్నారు. ఆయన నామినేషన్ దేశాన్ని నిర్వచించే ప్రజాస్వామ్య ఆదర్శాలను రక్షించడానికి, నిలబెట్టడానికి సమిష్టి సంకల్పాన్ని సూచిస్తుందని అన్నారు. ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయన నాయకత్వాన్ని ఈ సూత్రాలు మార్గనిర్దేశం చేస్తాయని, సభ ప్రజాస్వామ్య చర్చలకు నిజమైన కోటగా పనిచేస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని శక్తివంతంగా మార్చే విలువలను రక్షించడానికి, సంరక్షించడానికి ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో తమతో చేరాలని పార్లమెంటులోని ప్రతి సభ్యుడిని తాము పిలుస్తున్నామని అన్నారు.

తిరుపతి వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్

- ఈనెల 24, 25, 26న రాష్ట్రస్థాయి పోటీలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుపతిలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమరావతి ఛాంపియన్ షిప్- 2025 పేరుతో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని తెలియజేశారు. జిల్లాస్థాయి, జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకున్నారని వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 2వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాశాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడాశాఖ ఉన్నతాధికారులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీన విశాఖపట్టణంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఎం చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

కదిరిలో గంజాయి కలకలం

- భారీగా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం
- పట్టుబడిన వారిలో జాతీయపార్టీ నేత కుమారులు
- వారిని తప్పించేందుకే వివరాల వెల్లడిలో గోప్యత.?

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కొండమనాయుని పాలెంలోని ఓ ఇంటిలో పెద్దమొత్తంలో గంజాయి నిల్వలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన గంజాయి గ్యాంగ్‌లో ఓ జాతీయ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల పిల్లలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ జాతీయ పార్టీకి చెందిన నాయకులు అప్రమత్తమై ఆ పార్టీ పెద్దలను రంగంలోకి దింపి వారి పిల్లలను కేసు నుంచి తప్పించేలా పోలీసులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

అరెస్టు వివరాల వెల్లడిపై గోప్యత

పోలీసులు గంజాయి బ్యాచ్‌ను అరెస్ట్ చేసి రెండు రోజులు కావస్తున్నా అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించడంలో గోప్యత కొనసాగుతోంది. రెండు రోజులు అవుతున్నా ఇంకా వివరాలను ఎందుకు వెల్లడించడం లేదన్న దానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గంజాయి బ్యాచ్‌లో జాతీయ పార్టీ నాయకుని కుమారులతో పాటు కదిరి పట్టణానికి చెందిన హోటల్ నిర్వాహకుడి ప్రమేయం ఉండటంతో వారి పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు కావాలనే ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

యువతకు గంజాయి మత్తు

కొందరు యువకులు, విద్యార్థులు గంజాయికి అలవాటు పడి ఆ మత్తుకు బానిసలు అవుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి కదిరి పట్టణం, సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కళాశాలలు, విద్యాసంస్థల వద్ద గంజాయి గ్యాంగ్ ఈ విక్రయాలు చేస్తున్నారు. తక్కువ సమయంలో కోటీశ్వరుల కావాలన్న ఉద్దేశంతో కొందరు యువతకు గంజాయి మత్తును ఎక్కించి వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. కదిరి ప్రాంతంలో గంజాయి ఉండరాదని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాలు ఇస్తున్నా అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. గంజాయి సరఫరాదారులు, విక్రేతలకు ఇంటి దొంగలే సహకరిస్తున్నా రనే ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవల పట్టణ నడిబొడ్డున పోలీసులు గంజాయి సరఫరా చేస్తున్న వాహనాన్ని పట్టుకుని వదిలేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలోనూ కొత్త బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టణ పోలీసులు పట్టుకుని వారి నుంచి మామూళ్లు తీసుకుని వదిలేసినట్లు తెలుస్తోంది.

గంజాయి బ్యాచ్ ఆగడాలు

గంజాయి సేవించిన యువకులు ఇతరులపై దాడులు చేస్తున్న ఘటనలూ తరుచూ కదిరి ప్రాంతంలో వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కదిరి రూరల్ మండలం కాళసముద్రం గ్రామంలో గంజాయి సేవించిన గ్యాంగ్ అదే గ్రామానికి చెందిన విద్యార్థులను చింతబర్రలతో ఇష్టానుసారం చితకబాదారు. ఈ ఘటనపై ఆ గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కూడా తెలిపారు. తమపిల్లలుపై దాడికి పాల్పడిన గంజాయి గ్యాంగ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఆలస్యంగా వెలుగులోకి..
- ప్రశ్నించిన మీడియాపై ప్రిన్సిపల్ చిందులు

ప్రజాశక్తి - పరిగి

పరిగి మండలంలోని ఎపిఆర్‌ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈఘటనపై వివరాలు అడిగేందుకు వెళ్లిన విలేకరులపై పాఠశాల ప్రిన్సిపల్ చిందులు తొక్కారు. ఈఘటనకు సంబంధించి పాఠశాల సిబ్బంది ద్వారా విశ్వసనీయంగా వెలుగులోకి వచ్చిన వివరాలు.. కంబదూరు మండలానికి చెందిన విద్యార్థి మహేష్ బాబు 2020 సంవత్సరంలో ఏపీ ఆర్‌ఎస్ ఎంట్రన్స్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సంపాదించారు. గత నాలుగేళ్లుగా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. చురుకుగా ఉన్న మహేష్ బాబు కొన్ని రోజులుగా పాఠశాలలో కలత చెందాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురి కావడంతో ఈనెల మూడవ తేదీన పాఠశాల నుండి తన సొంతూరు కంబదూరుకు వెళ్లారు. అయితే మహేష్‌బాబు తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు సుముఖత చూపలేదు. విద్యార్థి పాఠశాలకు రాకపోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో తండ్రి ఈనెల 18వ తేదీన సోమవారం మధ్యాహ్నం పాఠశాలకు వచ్చిన మహేష్‌బాబు ప్రిన్సిపల్ ను కలిశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మరో ఉపాధ్యాయుడు విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో కలత చెందిన విద్యార్థి పాఠశాలలో ఉన్న క్రిమిసంహారకమందు తీసుకుని పాఠశాల ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన మహేష్‌బాబును హిందూపురం ప్రభుత్వాసుపత్రికి ద్విచక్ర వాహనంలోనే తీసుకెళ్లారు. విద్యార్థికి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ ఆసుపత్రిలో వైద్యం అందించే విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. అయితే పాఠశాల సిబ్బంది ద్వారా విషయం బయటకు రావడంతో మీడియా కవరేజ్ కి వెళ్ళిన రిపోర్టర్ల పై పాఠశాల ప్రిన్సిపల్ చిందులు తొక్కారు. సమాచారం ఇవ్వడంలో అనాసక్తి చూపడంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నారు. విద్యార్థి తండ్రికి నచ్చజెప్పి విద్యార్థిని వారి గ్రామానికి పంపించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కానీ ఉన్నత విద్యాశాఖ అధికారులకు కనీస సమాచారం లేకపోవడం పాఠశాల ప్రిన్సిపల్ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada-520002 (A.P.)

E-Procurement Tender Notice

NIT No. 08/MAU61-EE0EST(LR)/1/2025-ESTC Dt. 20.08.2025

Name of Work: "Repairs and Renovations (i.e.Civil, Water Supply & Electrical Works) of 14 existing shops at Payakapuram Shopping Complex, Vijayawada" Estimate Cost: **Rs. 8.00 Lakhs.**

The bid can be downloaded on AP e-procurement portal from **21.08.2025** to **04.09.2025** up to **14.00 Hrs**. Due date for submission of Bids **04.09.2025** up to **15.00 Hrs**, Technical bid opening **04.09.2025 @16.00Hrs**. For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**.

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
ఇబ్రహీంపట్నం శాఖ
వి.టి.పి.యస్ మెయిన్ రోడ్, సెక్యూరిటి కాలని ఎదురుగా, ఇబ్రహీంపట్నం, యన్.టి.ఆర్ జిల్లా - 521456
Email- ubin0810274@unionbankofindia.bank

డిమాండ్ నోటీస్

13(2) ఆఫ్‌సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

ఋణగ్రహీత మరియు హామీదారు పేరు మరియు చిరునామా: 1) శ్రీ గరికపాటి జయపాల్, తండ్రి. శేషారత్నం, 2) శ్రీమతి గరికపాటి సలోమి, భర్త.గరికపాటి జయపాల్, డి.నెం.1-36, గ్రామం పోస్ట్ పినపాక, మండలం-జి కొండూరు, జిల్లా: ఎన్.టి.ఆర్, ఏపీ-521228.

ఋణ స్వభావం	మొత్తము (రూ.) లక్షలలో	తేది. 11-08-2025 నాటకి బకాయి మొత్తము (రూ.)
102716650000003 (Housing Loan)	27,80,000/-	27,62,892/-
102716590000010 (Personal Loan)	9,90,000/-	7,53,452.52 పై

డిమాండ్ నోటిసు తేది. 12-08-2025

స్థిరాస్తి వివరములు: షెడ్యూల్-1: 1వ ఐటమ్: ఎన్.టి.ఆర్, జిల్లా, యస్.ఆర్.ఓ మైలవరం, జి. కొండూరు గ్రామం మరియు మండలం, ఆర్.యస్. నెం.212లో డాక్యుమెంట్ నెం.6855/2014 కలిగిన 21.66 చ॥గ॥ల స్థలం ఈ దిగువ హద్దులలో: తూర్పు: 2వ ఐటమ్ ఆస్తి, దక్షిణం: కడియాల సుధాకరరావు ఆస్తి, పశ్చిమం: పి. భాస్కర రెడ్డి ఆస్తి, ఉత్తరం: మాజేటి సీతాదేవి ఆస్తి. 2వ ఐటమ్: ఎన్.టి.ఆర్, జిల్లా, యస్.ఆర్.ఓ మైలవరం, జి. కొండూరు గ్రామం మరియు మండలం, ఆర్.యస్. నెం.212లో డాక్యుమెంట్ నెం.6855/2014 కలిగిన 72.15 చ॥గ॥ల స్థలం ఈ దిగువ హద్దులలో: తూర్పు: 3వ ఐటమ్ ఆస్తి, దక్షిణం: కడియాల సుధాకరరావు ఆస్తి, పశ్చిమం: 1వ ఐటమ్ మరియు కె. సుధాకరరావు ఆస్తి, ఉత్తరం: మాజేటి సీతాదేవి ఆస్తి. 3వ ఐటమ్: ఎన్.టి.ఆర్, జిల్లా, యస్.ఆర్.ఓ మైలవరం, జి. కొండూరు ...

... లేకుండా విక్రయించరాదు, మరియు లావాదేవీలు జరుపరాదు, సదరు సెక్షన్ నిబంధనల అతిక్రమణ జరిగితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 12-08-2025
ప్రదేశం : ఇబ్రహీంపట్నం
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (Bank of Maharashtra, ONE FAMILY ONE BANK, A Government of India Undertaking)
జోనల్ ఆఫీస్, విజయవాడ
1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హై స్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007. ఫోన్ : 0866-2431225

AX76/Vijayawada/SARFAESI/2025-26 తేది : 20-08-2025
(రూల్ 8 (1)) స్వాధీనత ప్రకటన

...

తేది : 20.08.2025
ప్రదేశం : విజయవాడ

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (Bank of Maharashtra)
జోనల్ ఆఫీస్, విజయవాడ
1వ అంతస్థు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హై స్కూల్ రోడ్డు, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007. ఫోన్ : 0866-2431225

AX76/Vijayawada/SARFAESI/2025-26 తేది : 19-08-2025
(రూల్ 8 (1)) స్వాధీనత ప్రకటన

...

ఈ నాలుగు హద్దుల మధ్య 1682 చ.అ.లు ప్లింత్ ఏరియా, 488 చ.అ.లు కామన్ ఏరియా, 240 చ.అ.లు కారు మరియు స్కూటర్ పార్కింగ్ ఏరియాలతో పాటు అన్ని అతికింపులు, ఫర్నీచర్లు మొదలగున వాటితో సహా అనుంధంలో తెలిపిన వివరముల ప్రకారం కలదు.

CERSAI Asset ID:200075043740

తేది : 19.08.2025
ప్రదేశం : విజయవాడ
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తరపున
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
విజయవాడ జోన్

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
(గతంలో ఓయిస్ ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పేరుగలది) (ప్రత్యామ్నాయంగా ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్)
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.94, మారోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, అంధేరి-కుర్ల రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి-400 059.
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల వేలం అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు & హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌చేయబడినది. దేనినైతే, సెక్యూర్డ్ క్రెడిటర్ అనగా., ఆరిక్ష్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచేత భౌతికంగా స్వాధీనంచేసుకోబడినది. ఇందు దిగువ పేర్కొన్నట్లు రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతలు నుండి ఆరిక్ష్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కు బకాయిగా ఇందు దిగువ పేర్కొన్న మొత్తాల రికవరీ కొరకు 25.09.2025 న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన బహిరంగ వేలం ద్వారా విక్రయించబడుతుంది. రిజర్వు ధర & ధరావత్తు డిపాజిట్ (ఇఎండి) ఇందు దిగువ పేర్కొనబడినవి.

రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతల పేరు / బకాయి మొత్తాలు / డిమాండ్ నోటీసే తేది	ఆస్తి వివరాలు	రిజర్వు ధర (రూ) / ధరావత్తు / బిడ్ పెంపుదల మొత్తాలు
- నరేశ్ కుమార్ ఉప్పుటాల - ఉప్పుటాల శివపార్వతి - శివలీలా ఉప్పుటాల - ఉప్పుటాల నాగలక్ష్మి - హెలాసన్న బైక్ జోన్ ... డిమాండ్ నోటీసు తేది: 15.02.2024.	కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పటమట సబ్-రిజిస్ట్రార్, మొగల్‌రాజపురం (గ్రా), రాణిగారితోట, చలసాని నగర్ వద్దగల దానికి అనుబంధ ఈజిమెంట్ & ఫిక్షర్స్ హక్కులన్నింటితో, దానిలో ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తు నివాసిత ... మొత్తం భాగం. మరియు సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.107, పడమర: రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.147, దక్షిణం: ప్లాట్ నం.145.	రూ.53,00,000/- (రూపాయలు యాభై మూడు లక్షలు మాత్రమే) / 10% ధరావత్తు రూ.5,30,000/- (రూపాయలు ఐదు లక్షల ముప్పై వేలు మాత్రమే) / ...

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు & షరతుల కొరకు, దయచేసి ఆరిక్ష్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్ అనగా., **https://www.orixindia.com/sales-notice.php** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 20.08.2025
సం/- అధీకృత అధికారి,
ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్.

ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ (IKF FINANCE)
హెడ్ ఆఫీసు: నెం.40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి.రోడ్, విజయవాడ-520 010.
బ్యాంక్ ఇమెయిల్ ఐడి: auctions@ikffinapp.com, ఫోన్ నెం.:0866-2474644.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన
అనుబంధం-IV-A [రూల్ 9(1)కు నిబంధన చూడండి]

ఆస్తి నెం. 19 : సిహెచ్. పూర్ణచంద్రరావు, సిహెచ్ మంగమ్మ, వై. శ్రీదేవి, జి. రాజేశ్వరి గార్ల పేరిట గుంటూరు - 522413, పిడుగురాళ్ళ, గ్యాస్ ఆఫీస్ రోడ్డు, డి.నెం. 7-294 వద్ద 428.74 చ॥గ॥లు (వాల్యూషన్ కొరకు 375.41 చ॥గ॥లు మాత్రమే పరిగణలోకి తీసుకోబడును) విస్తీర్ణంలోని స్థలము అందలి నివాస ఇల్లు అందలి (గ్రౌండ్ ఫ్లోర్ & ఫస్ట్ ఫ్లోర్స్). హద్దులు : తూర్పు : 7 లింకుల వెడల్పు బజారు, దక్షిణం : రోడ్డు, పడమర : రావిపాటి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, ఉత్తరం : పోట్ల పద్మావతి గారి ఆస్తి. డాక్యుమెంట్ నెం. 1317/2007, తేది : 03-04-2007, పిడుగురాళ్ళ ఎస్.ఆర్.ఓ.
(పైన పేర్కొన్న ఆస్తులకు ది. 18-06-2025 నాటి ప్రీ సేల్ నోటీసు ఉపసంహరించబడింది)
తేది : 06-08-2025 ప్రదేశం : విజయవాడ
చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అమెరికాలో అదానీ లాబీయింగ్

- ముడుపుల కేసు నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు
- న్యాయ సంస్థలకు వేలాది డాలర్ల ఫీజు చెల్లింపు



న్యూఢిల్లీ : అమెరికా న్యాయస్థానంలో ముడుపుల కేసును ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ దాని నుంచి బయటపడేందుకు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తోంది. ఇందుకోసం తాజాగా పేరున్న రెండు లాబీయింగ్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, ఇతర సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు భారత్‌లో ఇంధన కాంట్రాక్టులు దక్కించుకోవడానికి పెద్ద ఎత్తున ముడుపులు అందజేశారంటూ 2024 నవంబర్ 20న అమెరికా న్యాయ శాఖ ఓ అభియోగ పత్రాన్ని విడుదల చేసింది. దీనిపై ప్రస్తుతం కేసు నడుస్తున్న నేపథ్యంలో దాని నుంచి తప్పించుకునేందుకు అదానీ గ్రూప్ ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగానే తాజాగా రెండు లాబీయింగ్ సంస్థలను రంగంలోకి దింపింది.

2023లోనే మొదలైన ప్రయత్నాలు

తనపై మోపిన ఆరోపణల్ని అదానీ గ్రూప్ తోసిపుచ్చుతూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. అయినప్పటికీ 2023లోనే లాబీయింగ్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. అయితే వాటిపై అప్పుడు పెద్దగా దృష్టి సారించలేదు. వ్యాపార లక్ష్యాలకే ప్రాధాన్యత ఇచ్చింది. ఆ ఏడాది లాబీయింగ్‌కు అయిన మొత్తం ఖర్చు 40,000 డాలర్లు మాత్రమే. అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అదానీ సోలార్ యూఎస్‌ఏ వ్యవహారాలు నడిపింది. అప్పుడు దాని తరపున ఒకే ఒక రిజిస్టర్డ్ లాబీయిస్ట్ అనురాగ్ వర్మ ఉండేవారు. వాణిజ్య, విదేశాంగ శాఖలతోనూ, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ యూఎస్‌తోనూ, జాతీయ భద్రతా మండలితోనూ, ఓవర్‌సీస్ ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌తోనూ...ఇలా ప్రభుత్వ సంస్థలతో సంప్రదింపులు జరపాలని అదానీ గ్రూప్ అప్పుడు యోచించింది.

పెరుగుతున్న లాబీయిస్టులు...ఖర్చులు

లాబీయింగ్ వ్యవహారాలలో అనురాగ్ వర్మకు మంచి అనుభవం ఉంది. 1990వ దశకం నుంచి భారతీయులు, భారతీయ అమెరికన్లతో పాటు భారత ప్రభుత్వం కూడా వాషింగ్టన్‌లో తమ తరపున పనులు చక్కబెట్టేందుకు ఆయన సేవలను వినియోగించుకుంటున్నాయి. తనపై అభియోగాలు నమోదైన మరునాడే అకిన్ గంప్ స్ట్రాస్ హౌర్ అండ్ ఫెల్డ్ అనే న్యాయ, లాబీయింగ్ సంస్థను అదానీ నియమించుకున్నారు. కంపెనీ ఎదుర్కొంటున్న న్యాయపరమైన సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఈ సంస్థ రంగంలోకి దిగింది. ఆ తర్వాత అదానీ తరపున లాబీయింగ్ చేస్తున్న బృందంలో ఐదుగురు సభ్యులు చేరారు. ఈ బృందంలో కాంగ్రెస్ మాజీ సభ్యురాలు ఇలియానా రోస్-లెహ్టినెన్ కూడా ఉన్నారు. గత సంవత్సరం ఈ బృందానికి అయిన మొత్తం ఖర్చు 70,000 డాలర్లకు చేరింది. అకిన్ గంప్‌కు అదనంగా మరో 20,000 డాలర్లు చెల్లించారు. లాబీయింగ్ చేయాల్సిన లక్ష్యాలలో తాజాగా శ్వేతసౌధం కూడా చేయడం గమనార్హం. ఈ సంవత్సరం ప్రథమార్థంలో లాబీయింగ్ ఖర్చులు బాగా పెరిగాయి. ప్రముఖ లీగల్ డిఫెన్స్ సంస్థలైన కిర్క్‌లాండ్ అండ్ ఎల్లిస్ ఎల్ఎల్‌పీ, క్విన్ ఎమ్మాన్యుయేల్ ఉర్కుహార్ట్ అండ్ సల్లివాన్ ఎల్ఎల్‌పీని రంగంలోకి దించారు. దీంతో ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలోనే లాబీయింగ్ ఖర్చులు 1,50,000 డాలర్లకు చేరాయి. గత సంవత్సరం మొత్తంలో చేసిన ఖర్చుతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువే. ఇప్పుడు లాబీయిస్టుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ముడుపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీపైనే వీరంతా దృష్టి సారించారు. జనవరిలో ఈ కంపెనీ సొంతంగా అమెరికాలో అత్యంత శక్తివంతమైన రెండు లాబీయింగ్ సంస్థలను నియమించుకుంది. విదేశాంగ శాఖలో పనులు చక్కబెట్టేందుకు కొత్తగా నియమించబడిన లీగల్ బృందాలు ప్రయత్నిస్తాయి. ముడుపుల ఆరోపణల్లో విదేశీ అధికారుల ప్రమేయం ఉండడం, ఈ కేసుకు అంతర్జాతీయ స్వభావం ఉండడంతో ఇప్పుడు వాటి దృష్టి అంతా విదేశాంగ శాఖ పైనే నిలిచింది. ఏదేమైనా కేసు నుంచి బయటపడేందుకు అదానీ గ్రూప్ చేస్తున్న లాబీయింగ్ ఖర్చు ప్రతి ఏడూ పెరుగుతూ వస్తోంది. లాబీయిస్టుల సంఖ్యను కూడా పెంచుకుంటూ పోతున్నారు. ప్రభుత్వంతో సత్సంబంధాలు కలిగిన పేరున్న న్యాయ సంస్థల సేవలను వినియోగించుకుంటున్నారు. దేశాధ్యక్షుడి మాజీ డిప్యూటీ కౌన్సిల్, అధ్యక్షుని మాజీ స్పెషల్ కౌన్సిల్, మాజీ డిప్యూటీ స్టాఫ్ సెక్రటరీలతో సంబంధాలున్న వ్యక్తిని ప్రధాన లాబీయిస్టుగా నియమించారంటేనే అదానీ గ్రూప్ ఎత్తుగడలు ఏమిటో అర్థమవుతాయి. క్రిమినల్ వ్యవహారాలలో లాబీయింగ్ చేసే నిపుణులు కూడా లాబీయిస్టుల బృందంలో సభ్యులుగా ఉన్నారు.

భారత్‌పై అమెరికా అదనపు సుంకాలను ఖండించిన రష్యా

న్యూఢిల్లీ : రష్యా ముడి చమురును సేకరిస్తున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాలు విధించడాన్ని భారత్‌లోని ఆ దేశ రాయబార కార్యాలయం బుధవారం తీవ్రంగా విమర్శించింది. భారత్ నుండి వస్తువులు అమెరికా మార్కెట్‌కు వెళ్లలేకపోతే, వారు రష్యాకు ఎగుమతి చేయవచ్చని తెలిపింది. అమెరికా ఆంక్షలు ద్వంద్వ ప్రమాణాలను ప్రదర్శిస్తున్నాయని, జాతీయ ప్రయోజనాలను విస్మరించాయని విమర్శించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యానికి ఆటంకం కలిగించే అడ్డంకులను తొలగించాలనే రష్యా దృఢసంకల్పాన్ని రాయబార కార్యాలయ అధికారి స్పష్టం చేశారు. రష్యా ముడి చమురును కొనుగోలు చేయవద్దని భారత్‌పై ఒత్తిడి సహేతుకం కాదని మండిపడ్డారు.

చెల్లింపు వ్యవస్థలను మెరుగుపరచడం, వాణిజ్య అడ్డంకులను తొలగించడం ద్వారా భారత్‌తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయాలన్నదే రష్యా లక్ష్యమని తెలిపారు.

రష్యా ముడి చమురుపై భారత్‌కు సుమారు 5శాతం తగ్గింపు వస్తోందని, దీంతో భారత్‌కు లాభం ఎక్కువని, కొనుగోళ్లను మార్చుకునే అవసరం లేదని భారత్ నిర్ణయించుకుందని రాయబార కార్యాలయం పేర్కొంది. రష్యా ముడిచమురుకు ప్రత్యామ్నాయం లేదని, పోటీతత్వం కలిగి ఉందని తెలిపింది. భారత్ రష్యాకు చాలా ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి అని కూడా పేర్కొంది. ట్రంప్ విధించిన 25శాతం అదనపు సుంకం ఉద్రిక్తతలకు మరింత బలం చేకూరుస్తోందని విమర్శించింది. రష్యాతో భారత్‌చమురు వాణిజ్యాన్ని రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి పరోక్ష ఆర్థిక సాయంగా అమెరికా చూస్తోందని మండిపడింది. వాణిజ్య కార్యకలాపాలను సులభతరం చేయడానికి భారత్‌తో మెరుగైన చెల్లింపు విధానాలను అభివృద్ధి చేయడానికి నిబద్ధత కలిగి ఉన్నట్లు రష్యా రాయబార కార్యాలయం పేర్కొంది. ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ.. ఈ రెండు దేశాలు తమ బలమైన ఆర్థిక భాగస్వామ్యాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తున్నందున ఈ చర్య చాలా ముఖ్యమైనదని పేర్కొంది.

ద్వైపాక్షిక సంబంధాలపై రాయబార కార్యాలయ ప్రతినిధి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇబ్బందులు ఎదురైనపుడు కూడా సమర్థవంతంగా కలిసి పనిచేయడానికి ఇరు దేశాలు నిరంతరం మార్గాలను కనుగొన్నాయని అన్నారు. వాణిజ్యం, రక్షణ మరియు సాంకేతికత సహా వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం కోసం ఇరుదేశాల కొన్ని ఏళ్లుగా సన్నిహిత దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు.

'అగ్ని-5' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-5'ని భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒడిషాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి నిర్వహించిన ఈ ప్రయోగం.. అన్ని సాంకేతిక, కార్యాచరణ ప్రమాణాలను అందుకున్నట్లు తెలిపింది 'స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్' ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరిగినట్లు తెలిపింది. 5 వేల కిలోమీటర్ల వరకూ అగ్ని లక్ష్యాలను ఛేదించగలదని తెలిపింది.

కాగా, చివరిసారిగా గతేడాది మార్చి 11న 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యంతో రూపొందించిన 'అగ్ని-5' క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ అధునాతన క్షిపణిని 'మల్టీపుల్ ఇండిపెండెంట్ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్ సాంకేతికతతో అభివద్ధి చేశారు. దీనిద్వారా ఒకే క్షిపణి సాయంతో అనేక వార్‌హెడ్లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

శాంతి ఒప్పందంతో స్వర్గానికి.. : ట్రంప్

వాషింగ్టన్ : రష్యా, ఉక్రెయిన్ మధ్య కుదిరే శాంతి ఒప్పందంతో తాను స్వర్గానికి వెళతానని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్' టాక్ షోకు ఆయన మంగళవారం ఫోన్ ఇంటర్వ్యూ ఇస్తూ ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేయడానికి తాను ఎందుకు చర్యలు చేపట్టాల్సి వచ్చిందనే విషయంపై సరికొత్త వివరణ ఇచ్చారు. యుద్ధ నివారణ కోసం రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్స్కీ మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తున్నానని చెప్పుకొచ్చారు. 'యుద్ధంలో వారానికి ఏడు వేల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా రక్షించగలిగితే స్వర్గానికి పోతానన్నది నా భావన. దానికోసం ప్రయత్నించాలని అనుకుంటున్నా. నేను సరిగా పనిచేయడం లేదని అంటున్నారు. నిజంగా నేను అట్టడుగు స్థానంలో ఉన్నా. కానీ నేను స్వర్గానికి వెళితే మాత్రం అందుకు ఇది ఓ కారణం అవుతుంది' అని ఫాక్స్ న్యూస్ అతిథుల నవ్వుల మధ్య ట్రంప్ తెలిపారు. దక్షిణాసియా వ్యవహారాల్లో గతంలో జోక్యం చేసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ప్రస్తుత ప్రయత్నాలను దానితో పోల్చారు. 'భారత్, పాకిస్తాన్ దేశాల్లో అనేక మంది ప్రాణాలను కాపాడానని అనుకుంటున్నా. అక్కడ విమానాలను కూల్చేశారు. నేను అలాగే వదిలేస్తే అణు యుద్ధం జరిగి ఉండేది. నేను వాణిజ్యం ద్వారా పని పూర్తి చేశా' అని చెప్పారు.

ఆఫ్ఘన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 78 మంది మృతి

కాబూల్ : అఫ్ఘనిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో అఫ్ఘనిస్తాన్ వలసదారులతో వెళ్తున్న బస్సు, మోటారు సైకిల్ ఢీకొన్నాయి. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 78 మంది మరణించారు. వీరిలో 17 మంది చిన్నారులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు. నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతుంది. బస్సులో ఉన్న వారంతో ఇరాన్ నుంచి స్వదేశానికి తిరిగి వస్తున్న ఆఫ్ఘన్లే. ఆఫ్గాన్ నుంచి వలస వచ్చినవారిని ఇరాన్, పాకిస్తాన్ బలవంతంగా వెనక్కి పంపుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి దాదాపు 1.5 మిలియన్ల మందికి పైగా అఫ్గాన్లు బలవంతంగా స్వదేశానికి తిరిగివచ్చారు.

చైనా విక్టరీ డే పరేడ్‌లో అధునాతన ఆయుధాల ప్రదర్శన

బీజింగ్ : సెప్టెంబరు 3న నిర్వహించే విక్టరీ డే పరేడ్ సందర్భంగా చైనా తన అధునాతన ఆయుధాలను ప్రదర్శించనుంది. రెండో ప్రపంచయుద్ధం ముగింపు దినోత్సవం సందర్భంగా ప్రతీ ఏటా విక్టరీ డే పరేడ్‌ను చైనా అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది వచ్చే నెల బీజింగ్‌లో జరగనున్న పరేడ్‌లో అనేక సరికొత్త ఆయుధాలను నాడు ప్రపంచం ముందు ఆవిష్కరించనున్నట్లు ఆ దేశ ఉన్నతాధికారులు వెల్లడించారు. వందల మంది పీఎల్‌ఏ సైనికులు, ఫైటర్ జెట్లు, బాంబర్లు, ఇతర పరికరాలు ఈ ప్రదర్శనలో ఉండనున్నట్లు చైనా సైనిక అధికారులు తెలిపారు. ఈ పరేడ్‌లో ప్రదర్శించనున్న ఆయుధాలు మొత్తం దేశీయంగా తయారుచేసేవేనని తెలిపారు. 45 కంటింజెంట్లతో దాదాపు 70 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ పాల్గొననున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన జరగనున్న ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సరికొత్త క్షిపణులను ప్రపంచానికి చూపించనున్నట్లు చెప్పారు. వీటిల్లో వైజే సిరీస్‌లోని 15, 17, 19, 20 మోడళ్లు ఉండనున్నాయి. ఈ సిరీస్‌లోని క్రూయిజ్ క్షిపణులను భూమి, ఆకాశం, నౌకలు, సబ్‌మెరైన్ల నుంచి ప్రయోగించవచ్చు. వీటిల్లో వైజే-15ను సూపర్ సోనిక్ యాంటీషిప్ మిసైల్‌గా భావిస్తున్నారు. కాగా, వీటి చిత్రాలు ఇప్పటికే కొన్ని వెలుగులోకి రావడంతో.. ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి.

గాజాపై దాడులు మరింత ఉధృతం

- రంగంలోకి 50వేల ఇజ్రాయిల్ రిజర్వు బలగాలు

జెరూసలేం : ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నా ఇజ్రాయిల్ తీరు మారడం లేదు. గాజాపై దాడులను మరింత ఉధృతం చేస్తోంది. గాజాను పూర్తిగా ఆక్రమించుకోవడానికి ముందుకు వెళుతోంది. గాజాను పూర్తిగా ఆక్రమించుకునే ప్రణాళికకు ఇజ్రాయిల్ అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా రానున్న రోజుల్లో దాదాపు 50వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నారు. గాజా నగరంలోని ఇంకా అనేక ప్రాంతాల్లో హమాస్ చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయిల్ ఆరోపిస్తోంది. తమ సైన్యం అటువంటి ప్రాంతాలపై దృష్టిపెట్టిందని, త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50వేల మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుందన్నారు.గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడిఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదని, గాజాను ఆక్రమించుకున్న తరువాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పారు.

ఏడు ఉపగ్రహాలతో చైనా లిజియన్ రాకెట్ ప్రయోగం

బీజింగ్ : ఏడు ఉపగ్రహాలను తీసుకెళుతున్న లిజియన్-1 వై 10 రాకెట్‌ను చైనా మంగళవారం విజయవంతంగా ప్రయోగించి, నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాలన్నింటినీ ప్రవేశపెట్టింది. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.33గంటలకు వాయవ్య చైనాలో కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నొవేషన్ పైలట్ జోన్ నుండి ఈ ప్రయోగం జరిగింది. తాజా ప్రయోగంతో ఈ రాకెట్ ఇప్పటివరకు 70 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టగా, 7టన్నులకు పైగా పేలోడ్‌లను మోసుకెళ్ళిందని రాకెట్ చీఫ్ కమాండర్ హూ జియోవెయి చెప్పారు. విభిన్నమైన, అత్యంత అధిక బరువు కలిగిన ఉపగ్రహ ప్రయోగాలకు ఈ రాకెట్ బాగా దోహదపడుతుందని చెప్పారు. ఒకేసారి 50కి పైగా ఉపగ్రహాలను తీసుకెళ్ళగల సామర్థ్యం కూడా దీని స్వంతమని చెప్పారు. ప్రయోగ వ్యయాలను గణనీయంగా తగ్గించడానికి కూడా ఈ రాకెట్ బాగా దోహదపడుతుందని మిషన్ కమాండర్లు చెప్పారు.

సుప్రీంలో బెంగాల్ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ !

- స్కూల్ అప్పాయింట్‌మెంట్ల రివ్యూ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : సుప్రీం కోర్టులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. దాదాపు 24వేల స్కూల్ అప్పాయింట్‌మెంట్ల రద్దుకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ స్కూళ్ళలో దాదాపుగా 24వేల టీచర్లు, బోధనేతర సిబ్బంది నియామకాలను కొట్టివేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 3న సుప్రీం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పలు రివ్యూ పిటిషన్లను జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన బెంచ్ ఈనెల 5న తోసిపుచ్చుతూ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలు మంగళవారం బహిర్గతం చేశారు. మొత్తంగా ఈ విషయాన్నంతా తిరిగి విచారించాలని రివ్యూ పిటిషన్లు కోరుతున్నాయి. కానీ సంబంధిత అంశాలన్నీ ఇప్పటికే పరిశీలించి నందున, సమగ్రంగానే అన్నీ పరిష్కరించి నందున ఇప్పుడు మళ్లీ ఆ అంశాన్ని విచారించలేమని బెంచ్ స్పష్టం చేసింది. అన్ని కోణాల్లోనూ అన్ని అంశాలను పరిశీలించిన మీదట, అందరి వాదనలు విస్తృతంగా విన్న తర్వాతనే ఉత్తర్వులు జారీ చేశామని కోర్టు పేర్కొంది.

వీర్ భూమి వద్ద నివాళులర్పిస్తున్న ఖర్గే

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయనకు ఘనంగా నివాళర్పించారు. ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆయనకు నివాళులర్పించారు.కాంగ్రెస్ ఎంపి, రాజీవ్‌గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ తన తండ్రికి నివాళులర్పించారు. 'మీ నుండి కరుణ, ప్రేమ, దేశభక్తి వంటి విలువలను వారసత్వంగా పొందాము. మేమందరం ఈ విలువలను ఎప్పటికీ కాపాడుకుంటాము. వాటిని ఎవ్వరూ విచ్ఛిన్నం చేయలేరు. వాటిని ఎవరూ ఆపలేరు. వీటికై వేసే మా అడుగుల్ని ఆపలేరు' అని ఆమె తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఇక ప్రియాంకగాంధీ ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ స్మారక చిహ్నం వీర్ భూమి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఆమె వెంట తన భర్త రాబర్ట్ వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా కూడా వెళ్లి నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడ మల్లికార్జున ఖర్గే, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు. 'రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 'సద్భావన దివాస్'గా జరుపుకుంటుంది. ఈరోజు మనం సద్భావన దివాస్ జరుపుకుంటున్న సందర్భంగా లక్షలాది మందిలో ఆశను ప్రేరేపించి భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీని మనం గుర్తు చేసుకుంటాము. భారతదేశానికి సాధించిన అసంఖ్యాక విజయాలు రాజీవ్ గాంధీ వారసత్వాన్ని ప్రతిబింబించాయి. దేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చాయి. ఆయన జయంతి సందర్భంగా ఆయనకు మా ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నాము' అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు.

సమస్యలపై సాచివేత

(మొదటి పేజీ తరువాయి)

రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నో అంశాలు ప్రస్తావించాం : ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నేత విద్యాసాగర్

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో తాము 24 ప్రధాన డిమాండ్లతో పాటు 68 డిపార్టుమెంట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఎపి ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తెలిపారు. పిఆర్‌సి కమిషనరు నియామాకం గురించి గత ప్రభుత్వ కాలంలో డాక్టర్ మన్‌మోహన్ సింగ్ ను 12వ వేతన సవరణ సంఘంకమిషనరుగా నియమించడం జరిగిందని, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన పదవికి రాజీనామా చేశారన్నారు.

బకాయిలకు రోడ్‌మ్యాప్ ప్రకటించండి : ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు

ఉద్యోగులకు చెల్లించాల్సిన వేల కోట్లకు సంబంధించిన బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం తక్షణమే రోడ మ్యాప్ ప్రకటించాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు, పే స్లిప్పులో వచ్చేలా చూడాలన్నారు. పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే నియమించాలని, ఈ లోగా ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎల్లో కనీసం రెండు డిఎలు వెంటనే ప్రకటించాలని బొప్పరాజు ప్రభుత్వాన్ని కోరారు.

ఆ మూడు బిల్లులు అప్రజాస్వామికం

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమేనని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో విమర్శించింది.

చట్టంగా తీసుకురావాలన్న ఈ ప్రతిపాదనను అడ్డుకోవడానికి అన్ని రకాలుగా పోరాటం సల్పాలని సిపిఎం కృతనిశ్చయంతో వుంది. అవాంఛనీయమైన ఈ చర్యను సంయుక్తంగా ప్రతిఘటించేందుకు ప్రతిపక్షంలో భావసారూప్యత కలిగిన ప్రజాతంత్ర, లౌకిక పార్టీలన్నీ కలిసి రావాలని సిపిఎం కోరింది.

ఢిల్లీ ముఖ్యమంత్రిపై దాడి !

- నిందితుడు గుజరాత్ వ్యక్తిగా గుర్తింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై బుధవారం దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని ముఖ్యమంత్రి అధికార నివాసం వద్ద ప్రజల నుండి ఫిర్యాదులు అందుకునేందుకు ప్రతీ వారం నిర్వహించే 'జన్ సున్‌వాయి' కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఈ కార్యక్రమంలో నిందితుడు దగ్గరగా వచ్చి ఏవో పత్రాలు అందించి ఒక్కసారిగా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమె చేతిని పట్టుకుని తన వైపునకు గుంజాడు. ఈ సందర్భంగా కొన్ని తోపులాటలు జరిగాయి. అక్కడున్న వారు వెంటనే ఆ వ్యక్తిని పట్టుకున్నారు. అనుకోని ఈ చర్యతో ముఖ్యమంత్రి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు.

దాడి జరిపిన వ్యక్తిని పోలీసులు రాజేష్ భాయి ఖిమ్‌జీ భాయి సకారియా (42)గా పోలీసులు గుర్తించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నివాసి అని చెప్పారు. రాజ్‌కోట్‌లో గల నిందితుడి తల్లిని గుజరాత్ పోలీసులు ప్రశ్నించారు. తన కుమారుడు ఆటో రిక్షా డ్రైవర్ అని, జంతు ప్రేమికుడని, ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని ఆమె తల్లి చెప్పారు.

కాగా, ఈ దాడి ఘటనపై బిజెపి, ఆప్ పరస్పరం విమర్శలకు దిగాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి స్పందిస్తూ, రాజకీయాల్లో హింసకు తావు లేదన్నారు. ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే ఇక సాధారణ మహిళలకు రక్షణ ఏదని ప్రశ్నించారు. రేఖాగుప్తా డ్రామా ఆడుతున్నారని ఆప్ ఎంఎల్‌ఎ అనీల్ ఝూ విమర్శించారు. రేఖాగుప్తా తనకు 27ఏళ్ళ నుండి తెలుసునని, విద్యార్థి సంఘం నేతగా ఉన్న సమయంలోనూ ఆమె ఈ విధంగానే ప్రవర్తించారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి ఢిల్లీకార్యదర్శి హరీష్ ఖురానా తీవ్రంగా స్పందించారు. "ఇలాంటి చర్యల్లో పాల్గొన్న చరిత్ర ఆప్‌కే ఉంది" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

అనర్హులను తొలగించండి

- రేషన్ కార్డులపై రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ : ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ వంటి ప్రయోజనాలు పొందేందుకు అనర్హులైన రేషన్ కార్డు హోల్డర్ల జాబితాను కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రూపొందించింది. రేషన్ కార్డులు ఉన్న పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహన యజమానులు, కంపెనీల డైరెక్టర్లను ఈ జాబితాలో చేర్చారని తెలిసింది. రేషన్ కార్డులు ఉన్న వారి వివరాలతో ఐటీ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (డైరెక్టర్లు), రోడ్డు రవాణా-రహదారుల మంత్రిత్వ శాఖ (నాలుగు చక్రాల వాహన యజమానులు) వంటి ప్రభుత్వ విభాగాల డేటాబేస్‌ను సరిపోల్చి ఈ జాబితాను రూపొందించారు. ఆహార, ప్రజా పంపిణీ విభాగం జరిపిన క్రాస్-వెరిఫికేషన్ కసరత్తులో 94.71 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు, 17.51 లక్షల మంది నాలుగు చక్రాల వాహన యజమానులు, 5.31 లక్షల మంది కంపెనీ డైరెక్టర్లకు రేషన్ కార్డులు ఉన్నాయని తేలింది. మొత్తంమీద రేషన్ కార్డులున్న 1.17 కోట్ల మంది జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఉచితంగా ఆహార ధాన్యాలను పొందేందుకు అనర్హులని అధికారులు తేల్చారు. ఈ జాబితా ఆధారంగా అవసరమైన క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి సెప్టెంబర్ 30వ తేదీ నాటికి అనర్హులను తొలగించాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. అనర్హులను తొలగిస్తే వెయిటింగ్ లిస్టులో ఉన్న అర్హులు రేషన్ కార్డులు పొందేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 19.17 కోట్ల రేషన్ కార్డులు జారీ అయ్యాయి. దీంతో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం లబ్దిదారుల సంఖ్య 76.10 కోట్లకు చేరింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వోద్యోగులు, వార్షిక ఆదాయం లక్ష రూపాయలు అంతకంటే ఎక్కువ ఉన్న కుటుంబాలు, నాలుగు చక్రాల వాహన యజమానులు, పన్ను చెల్లింపుదారులు ఉచిత ఆహార ధాన్యాలు పొందేందుకు అనర్హులు. రేషన్ కార్డ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆర్‌సీఎంఎస్) డేటాబేస్‌లో వ్యత్యాసాలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాలను పునరుద్ఘాటిస్తూ కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పాలిత ప్రాంతాల సలహాదారులకు లేఖలు రాశారు.

ప్రతిపక్ష రాష్ట్రాలను కూల్చే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టారు. అయితే సభను వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

అనంతరం తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో తమ ఆందోళనను కొనసాగించారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే అమిత్ షా కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లు, రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులన ప్రవేశపెట్టారు. దీన్ని ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, మనీశ్ తివారీ, ఆరెస్పీ నేత ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసి, ఎస్‌పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ ఈ మూడు బిల్లులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. బిల్లులను జెపిసి, లేదంటే సెలక్ట్ కమిటీకి పంపాలని సూచించారు. ప్రతిపక్ష ఎంపిలు బిల్లుల కాపీలను చించివేసి, కాగితపు ముక్కలను విసిరేశారు. అనంతరం స్పీకర్ సభను మధ్యాహ్నం మూడు గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోకి భారీగా మార్షల్స్‌ను దింపారు. అయితే ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కొంత మందిని మార్షల్స్‌ను వెనక్కి పంపించేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సీటు ముందు ముగ్గురు మార్షల్స్‌ను పెట్టారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే బిల్లులను ప్రవేశపెట్టి, మూజువాణి ఓటుతో ఆమోదించారు. అలాగే ఈ బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా జెపిసికి సిఫారసు చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సభలోని 21 మంది సభ్యులను లోక్‌సభ స్పీకర్ జెపిసికి నామినేట్ చేయనున్నారు. రాజ్యసభలో 10 మంది సభ్యులను డిప్యూటీ ఛైర్మెన్ నామినేట్ చేయనున్నారు. సభలో ఉద్రిక్తతల నేపథ్యంలో సభను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించారు. మరోవైపు రాజ్యసభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాల హోరెత్తించారు. దీంతో రాజ్యసభ కూడా వాయిదాల పర్వం తొక్కింది. అనంతరం ఐఐఎం బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు.

విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లు జరగడం గిన్నీస్ వరల్డ్ రికార్డు అని టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు తెలిపారు. గిన్నిస్ రికార్డును సంస్థ ప్రతినిధులు సిఎం చంద్రబాబుకు అందించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం సందర్భంగా మమూరి టెక్ పార్కు ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. స్టాళ్లలను సిఎం చంద్రబాబు పరిశీలించారు. మంత్రులు నారా లోకేష్, టిజి భరత, నాదెండ్ల మనోహర్, భారత్ పోర్ట్సు ఛైర్మన్ బాబా కల్యాణ్, అమరరాజా బ్యాటరీస్ ఛైర్మన్ గల్లా జయదేవ్, ఐటిశాఖ ముఖ్యకార్యదర్శి కాటంనేని భాస్కర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీటి కుంటలో ఈతకొట్టేందుకు వెళ్లారు. శశి కుమార్, కిన్నెరసాయి, సాయికిరణ్, భీమేష్, వినయ్, మహబూబ్‌బాషా నీటికుంటలోకి దిగారు. దుర్గప్రసాద్ ఒడ్డున ఉండిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంటలోకి భారీగా వరద నీరు చేరింది. కుంటలో ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులు బురదలో చిక్కుకుపోయారు. ఒడ్డుకు రాలేక ఊపిరాడక ఐదుగురు కుంటలోనే మరణించారు. స్నేహితులు ఒడ్డుకు చేరుకోకపోవడాన్ని దుర్గ ప్రసాద్ గమనించి గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పారు. గ్రామస్తులు కుంట వద్దకు చేరుకుని ఆరుగురిని ఒడ్డుకు చేర్చారు. కిన్నెరసాయి కొన ఊపిరితో ఉండడంతో ఆదోనికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. మృతి చెందిన విద్యార్థుల్లో భీమేష్, సాయికిరణ్ వారి తల్లిదండ్రులకు ఏకైక కుమారులు. ఉన్న ఒక్క కుమారుడిని ఉన్నతంగా చదివించాలని ఎంతో ఆశపడ్డామని, ఇలా విగతజీవులుగా మారతారని ఊహించలేదని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురుని కంటితడి పెట్టించింది.

మృత్యువులో కూడా వీడని స్నేహం

శశి కుమార్, కిన్నెర సాయి అన్నదమ్ముల కుమారులు. ప్రతిరోజు ఇంటి నుంచి కలిసి పాఠశాలకు వెళ్లే అన్నదమ్ములు మృత్యువులో కూడా కలిసిపోయారని మృతుల తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : ఎమ్మెల్యే విరుపాక్షి

మృతుల కుటుంబీకులను ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పాఠశాల సమీపంలోనే గుంత తవ్వి వదిలివేయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. మృతుల కుటుంబీకులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీవన సౌరభం

పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

మీ కోసం

మెత్తగా దంచిన వాము చూర్ణాన్ని ఒక గ్లాసు మజ్జిగలో కలిపి తీసుకుంటే కఫం పలచబడుతుంది. శ్వాస మార్గాలు శుభ్రం అవుతాయి.

స్నేహితులుగా నిలిచాం..

గొడవలు ఎన్నో పడ్డాము
సరదాలు ఎన్నో చేశాము
సినిమాలు ఎన్నో చూశాము
షికార్లు ఎన్నో చేసాము
మాటలు ఎన్నో ఆడాము
పాటలు సరదాగా పాడాము
కథలు ఎన్నో చదివాము
కలిసి నాట్యం చేసాము
ధైర్యం ఎంతో ఇచ్చావు
త్వరగా బడికి వచ్చాము
పాఠాలన్నీ చదివాము
పరీక్షలు ఎన్నో రాశాము
ఎంతో అల్లరి చేసాము
స్నేహితులుగా నిలిచాము

- ఎం.సౌజన్య,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.

బాట

ఆలోచనలన్నీ పోగేద్దాం
అవకాశాలన్నీ వెతికేద్దాం!

ఆకాశానికి నిచ్చెన వేద్దాం!
ఒక్కో మెట్టూ ఎక్కేద్దాం!

తారలతో ముచ్చటిద్దాం!
చందమామతో చెలిమి చేద్దాం!

కాదేది అసాధ్యం
మొదటి అడుగే ఆలస్యం!

ఉన్నది ఒకటేగా జీవితం
ఉన్నత ఆశయం కలిగి ఉందాం!

అందరితో కలిసుందాం!
అందనంత ఎత్తుకు చేరుదాం!

ఈ తరానికి ఓ పాఠం అవుదాం!
భావి తరాలకో బాట అవుదాం!!

- తిప్పాన హరిరెడ్డి,
94938 32412,
విజయవాడ.

నేను గీసిన బొమ్మ



హెడావ్ వర్షిత్, 7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీ పూర్,
ఆదిలాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జన సంస్కృతికి ప్రతిరూపాలు

నిద్రపోతూ కనేది కల.. నిద్రావస్థలో ఉన్న జనాన్ని మేల్కొలిపేది కళ.. ఆ కళకు ఎన్నో రూపాలు. వాటిల్లో ఎప్పటికీ ఆదరణ తగ్గనవి జానపద కళలు. ఇవి అనాదిగా జనాల మాటలు, అనుభవాల్లోంచి పుడుతున్నవే. ఆంధ్రుల వికాసంలో జానపద కళలు భాగమయ్యాయి. ఇవి జనజీవన సంస్కృతికి ప్రతిబింబాలు. జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకొని వెలసిన జానపదాలు. విజ్ఞాన, వినోదాలను పంచేవిగా ఉన్నాయి. జానపదం అంటే పల్లె. పల్లె జనాలు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు ఈ కోవకిందకు వస్తాయి. ఒక సమూహంగా జీవించే వారి జీవన విధానం జానపదం (ఫోక్). ఈ పదాన్ని 22 ఆగస్టు 1846 తొలిసారి ఉపయోగించిన విలియం జాన్‌థారుస్ అనే భాషాశాస్త్ర వేత్త స్ఫూర్తితోనే 'వరల్డ్ ఫోక్‌డే'ను ఆగస్టు 22న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు.

శ్రమలో నుంచి పుట్టిన పాటలే...

తరతరాల మన జన సంస్కృతికి ప్రతిబింబంగా జానపదం విరాజిల్లింది. చలన చిత్రాలు, టెలివిజన్లు లేని రోజుల్లో ఆనాటి ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, ప్రాపంచిక విజ్ఞానాన్ని అందించిన ఘనత జానపద కళలకే దక్కుతుంది. జనపదాలు మన ప్రాచీన సాంస్కృతిక, జనజీవన విధానానికి, వస్తు, ఆహార సంస్కృతికి, ఆచార వ్యవహారాలకి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. నిరక్ష రాస్యులుగా పిలువబడి ఒక ప్రత్యేక సంస్కృతికి ప్రతీకగా నిలిచిన జానపదులు నిజంగా ఈ ప్రపంచానికి అన్నం పెడుతున్న శ్రమజీవులు. స్వార్థం ఎరుగని ఉపకార తత్వం గల సేవానిరతికి ఆదర్శప్రాయులు. రెక్కాడితే గాని డొక్కాడని జానపదులు శ్రమను మరచిపోవడానికి పనిలోపాడే పాట ఒక్కొక్కటి అత్యద్భుతం. నవ రసాలు పల్లవించే జానపదుల పనిపాటల్లో గుండె దరువు, గుండె బరువు, కన్నీళ్ళు, కష్టాలు అన్నీ అనుభవంతో ముడిపడినవే. అందుకే జానద గేయాలు మనసును ఆకర్షిస్తాయి. కొన్ని గేయాలు ఆలోచింపచేస్తాయి. జానపదులు నోళ్ళనుండి వచ్చే ఆశుకవిత్వం ఎంతో హృద్యంగా మనసులను రంజింపచేస్తుంది. మానవీయ సంబంధాలు, అనుబంధాలు, ఆప్యాయతానురాగాలు, కుటుంబ జీవన విధానాలను పట్టిచూపుతాయి. వరి కోతపాటల్లోనూ, కుప్పనూర్పుల్లోనూ, వివిధ ప్రదర్శన కళారూపాల్లోనూ కనిపించేగేయాలు ఎంతో వినోదాన్ని, ఆనందాన్ని, ఉల్లాసాన్ని కల్గిస్తాయి.

వందలాదిగా ఉన్న కళారూపాలు అభ్యుదయం, సాహిత్యవైభవం, వినోదం, ఆనందం, జీవన ఔచిత్యాన్ని తెలియజేసేవే. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. మరికొన్ని కొన ఊపిరితో ఉన్నాయి, ఇంకొన్ని కొత్త హంగులు సంతరించుకొని వేదికలపై వెలుగొందుతున్నాయి. జానపద కళలు అకస్మాత్తుగా ఆకాశాన్నుంచి ఊడిపడ్డవి కావు. అవి జానపదుల చెమట నుంచి, శ్రమ నుంచి ఆవిర్భవించినవే. జానపదులు శ్రమలు మర్చిపోవడానికి పాట అవసరమైంది. వారి నోట నుండి అప్రయత్నంగా ఆశువుగా వెలువడే గేయమే కళారూపాలకు ప్రాణం పోసింది. ఆ గేయంతోనే అడుగులు, చిందులు, గంతులతో, రకరకాల గమకాలతో, వివిధ ధ్వనులతో, అనేక దరువులతో కూడి వివిధ కళారూపాలు ఏర్పడ్డాయి. అందుకే జానపద కళలు మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

ప్రపంచీకరణ ప్రభావం

ఒకప్పుడు వ్యవసాయంలో ఎంతో ఆదరణ పొందిన కళారూపాలు ప్రపంచీకరణ ప్రభావంతో ఆధునిక యంత్రాల రాకతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పచ్చని పంట పొలాల్లో యంత్రాల రణగొణ ధ్వనులే వినిపిస్తున్నాయి. ప్లాట్ల రూపంలో అమ్మకాలకు సిద్ధమైన నేల పచ్చదనానికి దూరమవుతోంది. పచ్చదనం అంటే పల్లె ఉంటుంది. పల్లె ఉంటే పాడి, పంట ఉంటుంది. ఆ పాడి పంటతోనే పని ఉండేది. ఆ పనితోనే పాట ఉండేది. పని పాటతో కళారూపాలు ఊపిరి పోసుకునేవి. కానీ ఇప్పుడు ఊడ్పుల దగ్గర నుంచి కోతకోసే వరకు యంత్రాలే పనిచేస్తున్నాయి. అందుకే పల్లెల్లో జానపద కళలు, గేయాలు, పూర్తిగా కనుమరుగయ్యాయి.

కనుమరుగవుతున్న కళారూపాలు

జానపద కళారూపాల్లో ముఖ్యంగా చెక్క, చిందు భజనలు, చెంచిత, జవిటిక, రుంజ, తంబుర కథలు, పగటి, శక్తి వేషాలు, కత్తిసాము, కర్రసాము, ఇలాంటి కళలు గతంలో అందరినీ ఆకర్షిస్తూ విశేష ప్రాచుర్యాన్ని పొందేవి. వందలకొలదిగా ఉన్న కళారూపాల్లో కనుమరుగౌతున్న వాటిలో గంగిరెద్దులాటలు, మాస్టీడీ, మల్లికాసుల ఆటలు, కొమ్ము బూరలు, కోల సంబరాలు, కనికట్టు, మోడి, బుడబుక్కలాటలు, కొమ్మదాసరి ఆటలు, దొమ్మరాటలు, అగ్నిగుండాలు, శూల నృత్యాలు, వంటివి ప్రస్తుతం మసగబారిపోతున్నాయి.

పల్లెల్లోనూ కనిపించట్లా ...

ఒకప్పుడు పల్లెల్లో పిల్లలు దగ్గర నుంచి పెద్దల వరకు చక్కగా ఆడుకొనే ఆటలు కనబడటం లేదు. వాటిలో ముఖ్యంగా బొంగరాల ఆట, గూటిబిళ్ళాట, చింతపిక్కలు గవ్వలతో ఆడే సీతారాముడు ఆట, గచ్చనకాయలు, కోతి కొమ్మచ్చి, దాగుడుమూతలు, అరుగు మీద సుద్దతోనో, బొగ్గుతోనో గీసి ఆడుకొనే పులిమేక ఆట, వీటితో పాటు చిన్నపిల్లలు ఆడుకునే దూదూ పుల్ల దుక్కుడు బిళ్ళాట, దొంగపోలీసు, గోళీలాట, ఏడు పెంకుల ఆట, కబాడీలో కనిపించే వివిధ రకాలైన కూతలు పూర్తిగా కనుమరుగయ్యాయి. జానపదాల్లో ఏమూల విన్నా ఏదో ఒక గేయమో, కళా రూపమో కనపడేది, వినబడేది. ఇప్పుడు మన ప్రాచీన సాంస్కృతిక శోభ సన్నగిల్లింది. సంక్రాంతి పర్వదినాల్లో కూడా హరిదాసులకు పెద్దగా ఆదరణ ఉండటం లేదు. గంగిరెద్ల మేళాలు కూడా కనుమరుగవుతున్నాయి. శుభకార్యాల్లో గతంలో పాటలు ఉండేవి. ఇప్పుడు వినపడటం లేదు.

'జానపదం'పై పరిశోధనలు చేశా

జానపద ప్రదర్శన కళలపై పరిశోధన చేసి ఆంధ్రవిశ్వ విద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టాను తీసుకోవడమే కాకుండా ఉత్తమ సిద్ధాంత గ్రంథంగా 'బెస్ట్ థీసిస్' అవార్డు, స్వర్ణపతకాన్ని అందుకున్నా. యుజిసి, జెఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ పరిశోధకునిగా, ఉత్తమ పరిశోధన చేశా. ఏటేటా అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవాలను నిర్వహిస్తూ ఇప్పటి వరకు 160 మంది కళాకారులను సత్కరించాం. పలు జానపద కళారూపాలను ప్రదర్శనలు ఏర్పాటుతో నేటి తరానికి మన కళల ప్రాధాన్యతను తెలియజేస్తున్నాం. ఈ ఉత్సవాలకు అతిథులుగా జానపద విజ్ఞాన వేత్తలైన గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ్, అందెశ్రీ, వంగపండు ప్రసాద్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, వెనిగెళ్ళ రాంబాబు వంటి వారితోపాటుగా విదేశీ సాహితీ ప్రతినిధులు, ప్రముఖులు హాజరై తమ సందేశాలను ఇచ్చారు. ఫ్రెంచ్ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ నేజరస్ డేనియల్ పేరిస్‌తోపాటు దేశంలోని పలు విశ్వవిద్యాలయాల జానపద విజ్ఞానవేత్తలు కూడా ఇందులో భాగస్వాములయ్యారు. 30 జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడమే కాకుండా అనేక 20 వరకు గ్రంథాలను ప్రచురించాం.

- డాక్టర్ తరపట్ల సత్యనారాయణ
అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరం.
సెల్ : 9290630752

చీలిక ఒక పాచికగా ...

కార్మికులను బలహీనపర్చేలా నిర్మాతల ఎత్తుగడ • ఇలా అయితే నిరవధిక బందే : కార్మిక నేతలు

తెలుగు సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తమ వేతనాల పెంపుకోసం గత 17 రోజులుగా ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. గతంలో నిర్మాతల మండలి ఇచ్చిన హామీ మేరకు 30 శాతం వేతనాలు పెంచాలని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆలిండియా ఫిలిం ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్- యుఎన్ఐ- ఎంఇఐ అనుబంధం) ఆధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి, కోశాధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్), తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ (తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) కన్వీనర్ వెల్లంకి శ్రీనివాసకుమార్ పిలుపు మేరకు 24 క్రాఫ్ట్‌ల పరిధిలోని వేలాదిమంది కార్మికులు ఇందులో పాల్గొంటున్నారు. 17 రోజులుగా పోరుబాట కొనసాగుతున్నా నిర్మాతల మండలి ప్రతినిధులు ఏమాత్రం సర్దుబాటు దిశగా ఆలోచనలు చేసిన, చేస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. తెలుగు సినీ నిర్మాతల మండలి ప్రతి పాదించిన 11 షరతుల్లో తొమ్మిదింటిని ఫెడరేషన్ కార్మికుల పక్షాన ఆమోదించింది. మిగతా రెండు షరతులపైనే ఇంకా చర్చోపచర్చలు ఇరుపక్షాల మధ్య జరుగుతున్నాయి. బుధవారంకూడా ఇరుపక్షాల వారు ఇదే విషయమై చర్చించినా అవే షరతులను నిర్మాతలు లేవనెత్తారు.

యూనియన్లు అవసరమా?

కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే విధంగా నిర్మాతల వైఖరి కనిపిస్తోంది. వారి జీతభత్యాలు, పెరిగిన జీవన వ్యయం గురించి కార్మికులు మాట్లాడుతుంటే- నిర్మాతలు వారి వల్లే సినిమాలు నష్టపోతున్న ధోరణితో మాట్లాడుతున్నారు. మొదట్లో ఒకరిద్దరు నిర్మాతలు ఈ తరహా వ్యాఖ్యలు చేయటం వివాదాస్పదం అయింది. పెద్దల జోక్యంతో చర్చలు ఒక కొలిక్కి వస్తాయని అందరూ భావించారు. అయితే, నిర్మాతల మండలి మొత్తంగానే తన వైఖరిని మొండిగా ప్రదర్శిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. 'సినిమాలు తీసేది మేము. డబ్బుపెట్టేది మేము. గతంలో నుంచి నిబంధనలు, అగ్రిమెంట్లు ఉన్నాయి. 24 క్రాఫ్ట్‌లకు కార్మిక సంఘాలు ఉన్నాయి. కార్మికులను నిబంధనల మేరకు పనిలో పెట్టుకోమంటున్నారు. కానీ మాకు ఇబ్బందికరంగా ఉంటోంది. అసలు యూనియన్లు అవసరమా?. ఇవి మాకు గుదిబండలా మారాయి.. యూనియన్లు లేకుండా కార్మికులను స్వేచ్ఛగా మేము పనుల్లో పెట్టుకునే అవకాశం ఉండాలి. మాకూ నిర్మాతల సంఘం ఉంది. కానీ మా బాధలు తీరటం లేదు. మా అప్పులు పోవటం లేదు. మాకు సాయం చేసేవారే లేరు. సినిమాల్లో కథానాయకులను రీప్లేస్ చేయటానికి అవకాశం ఉండదు. అందుకే వారు అడిగిన మొత్తాలను ఇచ్చేయాల్సి వస్తుంది. టెక్నీషియన్లకు కూడా అలాగే ఇస్తున్నాం. కార్మికుల విషయంలోనే వారికి ఇచ్చే మొత్తాలపైనే మాకు భారంగా అనిపిస్తుంది.' అంటూ నిర్మాతలు కొందరు పదే పదే చెప్పుకొస్తున్నారు. పెద్ద పద్దులపై అధిక వ్యయం తగ్గించుకోవాల్సింది పోయి, రోజంతా శ్రమపడి పనిచేసే కార్మికులపై పడడమేమిటని యూనియన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఆశావహంగా చర్చలు జరగటం లేదు

'గత 17 రోజులుగా కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. 30 శాతం పెంచిన నిర్మాతల షూటింగులకు మాత్రమే వెళ్తున్నారు. మిగతా వారిని కూడా పెంచమని మేము కోరుతున్నాం. అయినా నిర్మాతల మండలి ప్రతినిధులు పెద్దగా స్పందించటం లేదు. చర్చల పేరుతో పిలిచి, అక్కడికి వెళ్లిన తర్వాత ఏవేవో మాట్లాడతారు. అసలు విషయాలు మాట్లాడకుండా మిగతా విషయాలపైనా, షరతులపైనే మాట్లాడమంటారు. బయట చెప్పేది ఒకటి, లోపలికి పిలిచాక వారు మాట్లాడేది మరొకటి. ఇలాగైతే ఎలాగ?. ఇప్పటికే సమన్వయ కమిటీని ఏర్పాటు చేశాం. మీటింగ్‌లు జరిగినా కొలిక్కి రాలేదు. మేము చర్చలను కోరుతుండగా వారు సరిగా స్పందించటం లేదు. షరతులు ఒప్పుకుంటే కార్మికులు ఇప్పుడు వచ్చే వేతనాల్లో 40 నుంచి 50 శాతం కోతకు గురౌతారు. పని గంటలు పెరుగుతాయి. తాజా నిబంధన ద్వారా కొన్ని క్రాఫ్ట్‌ల వారికి మరో రెండు గంటలు అదనంగా సమయం పెరిగే అవకాశం కూడా ఉంటుంది. కాల్షీట్ల సమయాలు మారిస్తే రోజున్నర కాల్షీట్ అడుగుతున్నాం. ఇది ఎంతో సమంజసమైన, న్యాయబద్ధమైన డిమాండ్. అలా ఇవ్వం, సెలవురోజుల్లోనూ, మామూలు కాల్షీటే ఇస్తామంటున్నారు. ఇది ఆమోద యోగ్యం కాదు. వారు పిలిచినప్పుడల్లా ఫిలిం చాంబర్‌కు వెళ్తున్నాం. కానీ మా నిర్ణయమే ఫైనల్ అంటూ హుకుం జారీచేస్తున్నారు. వారేమో ప్రెస్‌మీట్లు పెట్టి తమ బాధలు చెప్పుకుంటున్నారు. మేము మీడియాతో మాట్లాడకూడదంటూ షరతులు పెడుతున్నారు. మాగోడు కూడా ప్రజలకు, సినీ పెద్దలకు తెలియాలి కదా.. ఇప్పటికే రెండు రాష్ట్రాల మంత్రులు, తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం. నిర్మాతలు కూడా కలిశారు. చిరంజీవి కూడా స్పందించారు. మేము సానుకూలంగానే ఉన్నాం. వారు కూడా ఆ దిశగా చర్చలు ఫలప్రదమయ్యేలా చేస్తే మంచిదని మా సూచన' అని ఫెడరేషన్ నాయకులు స్పష్టంచేస్తున్నారు.

ఇలాగైతే నిరవధిక బంద్ తప్పదు

ఫెడరేషన్ పరిధిలోని 24 క్రాఫ్ట్‌ల పరిధిలోని కార్మిక సంఘాల పిలుపుతో మంగళవారంనాడు అన్నపూర్ణా స్టూడియోస్ రోడ్డులో వేలాదిమంది కార్మికులు కదం తొక్కారు. డ్రైవర్లు, మేకప్‌మెన్లు, డ్యాన్సర్లు, స్టంట్‌మాస్టర్లు, ప్రొడక్షన్, ఆర్ట్, డైరెక్షన్, కెమెరామెన్ ఇలా పలు క్రాఫ్ట్‌ల కార్మికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ వల్లభనేని, అమ్మిరాజు కులిమిల్లి, కోశాధికారి టి.వి.అలెగ్జాండర్ (అలెక్స్) మాట్లాడారు. 'నిర్మాతల మండలితో ఇప్పటివరకూ జరిగిన చర్చల్లో వచ్చిన అంశాలు, పెట్టిన షరతులు చాలా దారుణంగా ఉంటున్నాయి. సమన్వయ కమిటీ కూడా చర్చల దిశగా పనిచేస్తుంది. అయినా నిర్మాతల మండలి వారు సరిగ్గా స్పందించటం లేదు. మేము మీ పక్కన నిలబడుతున్నాం. మీరంతా ఐక్యంగా ఉంటే డిమాండ్లు సాధించుకోగలం. ఎలాంటి నిర్ణయమైనా అన్ని క్రాఫ్ట్‌ల జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటుచేసి తెలియజేస్తాం. సానుకూలంగా స్పందించాలని కోరుతున్నాం' అని వివరించారు. బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో కూడా ఫెడరేషన్ నాయకులు ఆందోళనను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. నిర్మాతలు మెట్టు దిగిరాకపోతే తాము నిరవధిక బంద్‌కు దిగటం తప్ప వేరు దారి లేదని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా మద్దతు

తెలుగు చిత్ర పరిశ్రమ (టిఎఫ్ఐ)లో వేతన అగ్రిమెంట్ కోసం కార్మికులు చేస్తున్న సమ్మెకు దేశంలోని పలు రాష్ట్రాల్లోని సినీ పరిశ్రమ కార్మిక సంఘాల నుంచి మద్దతు లభిస్తుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో అసంఘటితరంగంలో సుమారు 30 వేలమంది వరకూ పనిచేస్తున్నారు. సినీ కార్మికులకు సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సంఘీభావం ప్రకటించిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల యూనియన్ల నుంచి ప్రతినిధులు ఇప్పటికే సంఘీభావంగా లేఖలు పంపించారు.

శ్రేయస్, జైస్వాల్‌ను ఎంపిక చేయాల్సింది

- **ఆసియాకప్‌కు జట్టు ఎంపికపై మాజీ క్రికెటర్ల పెదవి విరుపు**

ముంబయి: ఆసియాకప్‌కు జట్టు ఎంపికపై మాజీ క్రికెటర్లు పెదవి విరుస్తున్నారు. శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌లకు చోటు దక్కక పోవడమే ఇందుకు ప్రధాన కారణం. శ్రేయస్‌కు మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మద్దతుగా నిలువగా.. జైస్వాల్‌ను ఎంపిక చేయకపోవడంతో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుబట్టాడు. యువ క్రికెటర్లకు సారథ్య బాధ్యతలు అప్పగించాలన్న ఉద్దేశ్యంతో శుభ్‌మన్ గిల్‌కు టి20ల్లో తిరిగి చోటు కల్పించారని, ఈ ఫార్మాట్‌లో గిల్ పునారాగమనం సవాలుతో కూడుకుందని, భవిష్యత్తులో మూడు ఫార్మాట్‌లకు ఒకే కెప్టెన్ ఉంటే మంచిదనే అభిప్రాయంతోనే ఈ ఎంపిక జరిగినట్లు తెలుస్తుం దన్నాడు. గతంలో టి20లకు వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి మరీ ఉప సారథ్య బాధ్యతలు గిల్‌కు అప్పగించారని సెలెక్టర్లు ఇలా ఎందుకు చేశారో అర్థం కావడం లేదని అశ్విన్ తెలిపాడు. ఇక టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రస్తుత సెలెక్షన్ కమిటీ ఛైర్మ న్ అజిత్ అగార్కర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. శ్రేయస్‌ను ఎంపిక చేయకపోవడానికి గల కారణా లేమిటో సెలెక్షన్ కమిటీ వెల్లడించాలని, దాని వెనుక ఉన్న మర్మమేమిటో బహిర్గతపర్చాలని దుయ్యబట్టాడు.

17 ఏళ్లలో ఇదే తొలిసారి...

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లేకుండా ఒక ప్రధాన టోర్నీలో భారతజట్టు ఆడడం ఇదే తొలిసారి. 2008 తర్వాత భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేర్లు లేవు. 2008లో ఆడిన ఆసియా కప్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా ఉన్నాడు. ఇది రోహిత్ శర్మకు తొలి ఆసియా కప్. ఆ ఎడిషన్‌లో విరాట్ జట్టులో లేడు. 2010లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌కు కూడా ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ ఆ ఎడిషన్‌లో జట్టులో ఉన్నారు. 2012లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌లో ధోనీ కెప్టెన్‌గా, విరాట్ కోహ్లీ వైస్ కెప్టెన్‌గా ఉన్నారు. రోహిత్ శర్మ కూడా జట్టులో ఉన్నాడు. 2014లో విరాట్ కోహ్లి, 2016లో ధోనీ, 2018లో రోహిత్ శర్మ కెప్టెన్లుగా ఉన్నారు. ఈసారి టి20 ఫార్మాట్‌లో ఆసియాకప్ జరుగుతున్న దృష్ట్యా.. వీరిద్దరూ ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో 17ఏళ్ల తర్వాత భారతజట్టు వీరిద్దరూ లేకుండానే బరిలోకి దిగుతోంది.

నలుగురు ఆల్‌రౌండర్లకు చోటు

ఆసియాకప్‌కు ప్రకటించిన జట్టులో నలుగురు ఆల్‌రౌండర్లకు చోటు దక్కింది. అక్షర్, హార్దిక్, అభిషేక్, దూబేలకు సెలెక్షన్ కమిటీ ప్రకటించిన 15మంది జట్టులో చోటు లభించింది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా నిర్ణయాత్మక మ్యాచుల్లో ఆడొచ్చు. వికెట్ కీపర్ కోటాలో సంజు, బ్యాటర్లుగా గిల్, సూర్యకుమార్, తిలక్ వర్మ, రింకు ఆడడం ఖాయం. దీంతో ఆసియాకప్‌కు భారత్ బలీయ జట్టుతోనే బరిలోకి దిగనుంది.

ప్రపంచకప్‌కు అర్హత సాధించడమే లక్ష్యం

హాకీ ఇండియా కోచ్ ఫుల్టన్

భువనేశ్వర్: ఈనెలాఖరునుంచి జరిగే ఆసియాకప్ హాకీ టోర్నమెంట్‌కు భారత్ బలమైన జట్టుతో వెళ్లనుంది. హాకీ ఇండియా(హెచ్ఐ) బుధవారం ప్రకటించిన 18మంది ఆటగాళ్ల బృందానికి హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. హెడ్‌కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞులతో కూడిన జట్టుతో బరిలోకి దిగనున్నామని, తమ ప్రధాన లక్ష్యం ప్రపంచకప్‌కు అర్హత సాధించడమేనని, దీంతో ఆసియాకప్ టోర్నీ తమకు కీలకంగా మారిందని అన్నారు. గోల్‌కీపర్లుగా క్రిషన్ బి పాఠక్, సూరజ్ కర్కేరా ఎంపికయ్యారు. డిఫెన్స్‌లో హర్మన్‌ప్రీత్, అమిత్ రోహిదాస్, జర్మన్‌ప్రీత్ సింగ్, సుమిత్, సంయ్, జుగ్‌రాజ్ సింగ్ ఉంటారని కోచ్ తెలిపారు. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు జపాన్, చైనా, కజకిస్తాన్ ఉన్నాయి. 2026 హాకీ ప్రపంచకప్‌కు బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యమివ్వనుండగా.. విజేతగా నిలిచిన జట్టు ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది. భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను ఆగస్టు 29న చైనాతో తలపడనుంది. 31న జపాన్, సెప్టెంబర్ 1న కజకిస్తాన్‌తో ఆడనుంది. ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 7వరకు రాజ్‌గిరి వేదికగా ఆసియాకప్ టోర్నమెంట్ జరగనుంది.

జట్టు: గోల్‌కీపర్లు: క్రిషన్ బి. పాఠక్, సురజ్ కర్కేరా **డిఫెండర్లు:** సుమిత్, జర్మన్‌ప్రీత్, సంజయ్, హర్మన్‌ప్రీత్, రోహిదాస్, జుగ్‌రాజ్ **మిడ్‌ఫీల్డర్లు:** రాజిందర్, రాజ్ కుమార్ పాల్, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్, వివేక్ సాగర్. **ఫార్వర్డ్స్:** షిలానంద్ లక్రా, అభిషేక్, సుఖ్‌జీత్, దిల్‌ప్రీత్ **స్టాండ్‌బై:** నీలమ్ సంజీప్ సక్సేనా, సెల్వమ్ కార్తి.

సురుచి-సౌరభ్‌కు కాంస్యం

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్

షైమ్‌కెంట్(కజకిస్తాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లకు మరో పతకం దక్కింది. బుధవారం జరిగిన 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం విభాగంలో సురుచి సింగ్-సౌరభ్ చౌదరి కాంస్య పతకం సాధించారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 5వ స్థానంలో నిలిచి పతక రేసులో నిలిచిన భారత జంట.. ఫైనల్లో అద్భుత ప్రదర్శనను చూపారు. ఈ క్రమంలో 578పాయింట్లతో మూడో స్థానానికి పరిమితమైనా.. 3 పాయింట్ల తేడాతో స్వర్ణ పతక పోరుకు దూరమయ్యారు. సురుచి 292పాయింట్లు, సౌరభ్ 286పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని అందించారు. కాంస్య పతక పోరులో చైనీస్ తైపీతో తలపడిన భారత జంట 17-9పాయింట్లతో విజయం సాధించారు.

భారత్‌కు జూ.మిక్స్‌డ్ టీం స్వర్ణం

భారత జూనియర్ షూటర్లు స్వర్ణ పతకంతో మెరిసారు. వంశిక చౌదరి, జొనాథన్ గవిన్ ఆంటోనీలతో కూడిన జంట 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం విభాగంలో బంగారు పతకం సాధించారు. భారత జంట హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత జంట 16-14పాయింట్ల తేడాతో కిమ్-యేజిన్(కొరియా)లను ఓడించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68